ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 10, 2005

కొత్త పోప్ ఎవరు ?

జాన్‌పాల్-II కి సెలవు

హ్యాపీ బర్త్‌డే

10.4.2005నుంచి
16.4.2005వరుచి

భవ్యశ్రీ
1సం॥, 10.4.2004
ఋషికళ-పవన్‌కుమార్
బాలాపూర్-రంగారెడ్డి

తస్లీమ్
4సం॥, 10.4.2001
సాజిదా-బాషా
ముత్తుకూరు-నెల్లూరు

చిన్నా
1సం॥, 10.4.2004
సుభద్రాదేవి-హుసేనప్ప
పెద్దతుంబళం-కర్నూలు

డింపు
2సం॥, 11.4.2003
స్వరూపరాణి-వెంకన్న
పగిడేరు-ఖమ్మం

సాహితి
3సం॥, 11.4.2002
సుజాత-శంకర్
గాజువాక-విశాఖ

అనిరుధ్ దధీసాగర్
1సం॥, 13.4.2004
సుష్మ-కరుణాకర్
తాండూర్-రంగారెడ్డి

అనూష
7 ॥, 15.4.1998
సువర్ణ-దయాకర్
జమ్మడపుడి-ఆదిలాబాద్

రేచల్ స్నేహ
1సం॥, 15.4.2004
సుజాత-ఏసన్న
కుటాగుళ్ల-అనంతపురం

అర్చన
2సం॥, 16.4.2003
పద్మ-రవి
అమరచింత-మ॥నగర్

సాయితేజ
మంజుల-చంద్రశేఖర్
మిర్యాలగూడ-నల్లగొండ

రాకేష్
5సం॥, ఏప్రిల్-2000
ప్రమీల-వెంకటయ్య

రితిక
4సం॥, ఏప్రిల్-2001
ప్రియాంక-లోకేష్
చెన్నారం-మ॥నగర్

గాయత్రి-లక్ష్మీవెలుగొండారెడ్డి
రామలక్ష్మమ్మ-శ్రీనివాసరెడ్డి
పెద్దారవీడు-ప్రకాశం

భువనేశ్వరి
4సం॥, 10.4.2001
ఇంద్రమ్మ-సంగమేశ్వర్
సదాశివపేట-మెదక్

కీర్తి
2సం॥, ఏప్రిల్-2003
నాగమణి-పెంచలయ్య
ముత్తుకూరు-నెల్లూరు



రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

వన్స్‌మోర్...

మార్చి 27వ తేదీ సంచిక కవర్‌స్టోరీ "వన్స్‌మోర్...(నాటకం వర్ధిల్లుతుంది) అంటూ వెలువరించిన వ్యాసం సందర్భోచితంగా ఉంది. ఆద్యంతమూ చదివించింది. కళారంగం పట్ల నాటకాల పట్ల విశాలభావమున్న ప్రజాశక్తికి ధన్యవాదాలు. కంప్యూటర్‌ను సృష్టించిన మనిషి మానవ మనుగడను సరికొత్త దిశలో పయనించేలా చేస్తున్నాడు. అటువంటి ఈ ఆధునిక స్పీడు యుగంలో కూడా రంగస్థలం కొనసాగుతుంది అనటం చాలా ఆశాజనకంగా ఉంది. సురభి కళాకారుల గురించి రాయటం ఈ వ్యాసానికి పరిపూర్ణత చేకూర్చింది. భవిష్యత్తులో కూడా నాటకాలపై ఇలాంటి మంచి వ్యాసాలు ఇవ్వాలని కోరుకుంటున్నాను. హేపీబర్త్‌డే, కలంస్నేహం పేరిట ఇస్తున్న విధానం చాలా బాగుంది.

-నెమలిదిన్నె రమణారెడ్డి,
వివేకానంద కోచింగ్ సెంటర్, ఒంగోలు

నాటకం వర్ధిల్లుతుంది

అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం నాడు ప్రచురించిన కవర్‌స్టోరీ బాగుంది. సినిమాకు మూలం నాటకం" అన్న సంగతి ప్రస్తుతమున్న గ్లామర్ సినీ ప్రపంచం మరచిపోతున్నది. సినిమా అంటే ప్రస్తుత కాలంలో మూడు శృంగారాలు ఆరు బూతుమాటలుగా మారిపోయింది. నాటకాల్ని చూసి సినిమా తన బుద్ది మార్చుకోవాలి. రాష్ట్రప్రభుత్వం కూడా నాటకాలను ప్రోత్సహించాలి.

-పొట్లపల్లి మహేశ్‌బాబు, ఎల్లూరు,
మహబూబ్‌నగర్‌జిల్లా

ముఖచిత్రం హైలైట్

రంగస్థలం గురించిన కవర్‌పేజీ డిజైనింగ్ బాగుంది. కవర్‌స్టోరీలో ఈ ఏడాది సందేశమిచ్చిన ఫ్రెంచి నాటకదర్శకురాలు ఎరియన్ మౌష్కిన్ ఆంగ్ల కవితాసందేశం అనువాదం బాగుంది.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్



పరీక్షల భయం!

జీవనశైలి శీర్షికలో "ఎగ్జామినేషన్ ఫోబియా'' గురించి చక్కగా రాశారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయ్యాలని, పరీక్షల కోసం ఆత్మహత్యలు పరిష్కారం కాదని బాగా వివరించారు. చదువొక్కటే ఓ వ్యక్తి జీవితానికి గీటురాయి కాదని, చదువురాకపోయినా తమ ప్రతిభ చాటుకునే అనేక రంగాలున్నాయని వెన్నుతట్టి ప్రోత్సహించారు. 'తాళిబొట్టు-నేతి అరిశెముక్క' కథలో తన అత్తమ్మ కోరిక తీర్చేందుకు రంగమ్మ తాళిబొట్టు తీసి ఇవ్వడం, ఆమె భర్త బతికున్నాడో లేడో తెలియక ఆమె పడే ఆవేదనకు నా హృదయం ద్రవించింది. ఇంతిసంగతులు శీర్షికలో 'మాలచ్మి కాదు ధనలచ్మి' రచనలో ఆడపిల్ల పట్ల చిన్న చూపుని, మగపిల్లాడులే అన్న గర్వం పనికిరాదని చక్కగా వివరించారు.

-ఎం లలిత, **కంచరాం, శ్రీకాకుళం జిల్లా**

అంధుని నృత్యం

రియల్‌స్టోరీగా ప్రచురించిన 'అంధుని నృతం' చాలా బాగుంది. బసేగౌడ్ సమాజానికి ఇచ్చిన సందేశం నన్నెంతో ఆకట్టుకుంది. 'నాలా ఏ కళ లేకపోయినా అంధుల్ని మాత్రం ఆదరించండి. అలా చేయడమే మీరు నాకు అందించే నిజమైన సత్కారం' అన్న మాటలు మా కళ్ళల్లో నీళ్ళు తెప్పించాయి.

-కుక్కల కోటేశ్వరరావు,
జానకిపురం, ఖమ్మం జిల్లా.

రచనలన్నీ బాగున్నాయి

'తాళిబొట్టు' కథ, అంధుని నృత్యం-రియల్‌స్టోరీ, 'మాలచ్మి కాదు... ధనలచ్మి'-ఇంతి సంగతులు, న్యాయసలహాలు, జీవనశైలి ఇలా అన్ని శీర్షికల రచనలు బాగున్నాయి. ఇలా చక్కగా నిర్వహిస్తున్న ప్రజాశక్తి మూడుపువ్వులు-ఆరుకాయలుగా అభివృద్ధి అవ్వాలని కోరుతున్నాం.

-అన్నే వెంకట కృష్ణారావు,
గన్నవరం, కృష్ణాజిల్లా

టూరిస్ట్‌గైడ్

జైపూర్ కోటకు వెళ్ళకుండానే వెళ్ళి చూసినంత ఆకర్షణీయంగా టూరిస్ట్‌గైడ్ లో రాశారు. సిటీప్యాలెస్, హవామహల్, జైపూర్‌కోట ఫొటోలను, రాసిన వ్యాసాన్ని చూస్తే నిజంగా ఆ ప్లేస్‌లకు వెళ్ళినంతగా రాశారు. బాగుంది. నేతి అరిశె ముక్క కథ చాలా హృద్యంగా ఉంది. కార్టూన్ కదంబంలో ప్రభుత్వ తీరు-నక్సల్స్ ప్రభావం పై కార్టూన్ బాగుంది. పదిపైసల కడప దోశె ఐటమ్ ఔరా అనిపించింది.

-పి విలియం మేరీ,
పాడేరు, విశాఖజిల్లా

కోయిల గొంతుకేమైందో...

నిన్నటి ఉగాది కోయిల గొంతు బొంగురు పోయిందేవిటోనండీ.

ప్రపంచంలో తిరిగి గొంతు పోగొట్టుకుందా అనుకోవడానికి ఇదేం చలికాలం కాదు మరి. అయితే గియితే అందరూ నిస్పృహగా అనుకునే కలికాలం అయ్యుంటుంది!

అదేపనిగా ఉగాదిపచ్చడి మేసీమేసీ... అందులోని పులుపుకి గొంతు జీరవోయిందామరి?...ఆ ఛాన్సే లేదండి.

గిరిజనుల నోళ్ళుకొట్టి ఎయిర్‌కండీషన్ ప్యాకేజీలో అందనంత ధరల చిటారుకొమ్మన ఎక్కి కూర్చున్న చింతపండుకి మన నోళ్ళు పులుపు చేసేంత సీను లేదు.

పర్యావరణ సమతుల్యతకు నూకలు చెల్లగొట్టాక వచ్చి పడ్డ సునామీ దెబ్బకు కమిలిపోయిన ఋతువులు కదా...మామిడికింక పులుపెక్కడిదీ!

పేటెంట్ జైల్లో పడ్డ వేపచెట్టుకి వేపపువ్వు పూతవేసుకునే అనుమతి పత్రం అమెరికానుంచి వచ్చిందో లేదో మరి!

పచ్చడి...పచ్చడి పుల్లన...ఆ ఘాటుకి గొంతు పోవడం కూడానా!?

మరింతకీ మన ఉగాది కోయిల గొంతుక్కి ఏ పచ్చి వెలక్కాయడ్డుపడ్డట్టూ?!

కలికాలమంటున్నారు కదా కొందరు...ఆ కలికాలపు పెడబుద్ధులకు అవాక్కయి అలా కూసిందేమో!

ఇప్పటి పాలకుల బుద్ధులను పెడబుద్ధులనే కంటే విపరీత బుద్ధులు, ద్వంద్వబుద్ధులనవచ్చుంటాను. మరి మీరేమంటారో?!

కావ్పోతే ఏంటి చెప్పండి. శ్వేత సౌధాధిపతి బుష్షుగారు తన చేతికంటిన ఇరాకు నెత్తుటి మరకలు తన చేతి గ్లౌజులలోనన్నా దాచుకోకుండానే మానవత్వం గురించి చిలకపలుకులు పలుకుతుంటే చిలకలన్నీ నోరుమూసేశాయి కదా! హాస్పటల్ బెడ్‌పై నరకయాతన అనుభవించే రోగికి మెర్సీకిల్లింగ్‌ను అనుమతించేది లేదని అన్నారుట మరి!

ఎంత దయాగుణం!

ఇలాంటి మిడిమేలాలు, ద్వంద్వనీతులు చూస్తే ఎవ్వరికైనా గొంతుపూడిపోదూ!!!

★

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	6
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
కచేరి . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	21
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

"ఆహా! చప్పట్లే... చప్పట్లు

కథ ... 9, 10



ఇంగ్లండుప్రేమ-ఇండియాపెళ్లి

రియల్ స్టోరీ ... 14, 15

"వాళ్ళూ బతకాలికదా!"

జీవనశైలి . . . 21

నేటి మేటి విలన్ సాయి

కళాసాహితి . . . 22, 23



K.V.R. B.Com., B.L., (Director)

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను.

– జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ్ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు... ఇలా 12 భారతీయ భాషలు (12 ఇన్ 1 పోకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పోకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు. 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు. 3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్సు. 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు. 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు. 6. యోగా కోర్సు. 7. పా 'మిస్టరీ' కోర్సు. 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు. (8 ఇన్ 1 పోకెట్ సైజులో) గిఫ్ట్ పుస్తకాలు సైజు 9 cm X 11 cm లోనూ, కోర్సు మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. *ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో నాలుగు నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు అతి తక్కువ నియమిత నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న ఎలాంటి నిబంధన లేదు.

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు

నెల్లూరులో ఒక్కరోజులో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించి రికార్డ్ సృష్టించిన ప్రోగ్రామ్‌లో కె.వి.ఆర్. ఇలాగే హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, ఒంగోలు, కడప, ఏలూరు, చిత్తూరు, నల్లొండ, కర్నూలు తదితర పట్టణాల్లో కూడా నిర్వహించి రికార్డ్ సృష్టించారు.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
044-55519114.
0-9383302010.
0-9282107404.

చెన్నై ఫోన్ నెంబరుకు చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక చెన్నైకి ఫోన్ చేసి కూడా మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు. పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసు తెలియజేసి కోర్సు పొందవచ్చును. పై నెంబర్లలో ఏ ఫోన్‌కు అయిన మీ అడ్రస్ చెప్పండి. కోర్స్ వి.పి.పి.లో పొందండి. ఇంకా ఆలస్యం ఎందుకు..... వెంటనే రింగ్ చేయండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

3249

SINCE 1990

KVR INSTITUTE

AWARD WINNER

ఉచితం! రూ.100/-లు విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో)

No.76 (S), Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ఒక నెల కె.వి.ఆర్. ఇంగ్లీష్‌కోర్స్, అడిషనల్ బుక్స్, కోర్స్‌కు ఉపయోగపడే పేపర్ చార్ట్స్, 25 గిఫ్ట్‌పుస్తకాలు, 'కష్టమైన ఇంగ్లీషు - సులభమైన కిటుకులు' పోకెట్ సైజు పుస్తకం మరియు ఉచితంగా రూ.100/- లు విలువచేసే 'మెమరీ ఇంప్రూవ్‌మెంట్ కోర్సు' (సింపుల్ ఇంగ్లీష్‌లో) ఇవన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.441/-లు పైకం చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....

.... Pin Code: ☐☐☐☐☐☐

* SERVICE TAX INCLUDED

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **HYDERABAD: Dilsukhnagar.** Setwin Building, Opp: Venkatadri Theatre, **Ph:** 24141919, Cell:9848544519. **Ameerpet.** Dhanunjaya Chambers, Near: Saradhi Studio, Yousufguda Main Road, Ph: 30913546. **Uppal.** Above Bajaj Show Room, Jetta Mallaiah Complex, Ph: 27202461. ● **SECUNDERABAD: # 110,** College of Technology & Engineering Building, Opp: Hotel Abhiruchi, Paradise Circle, S.D.Road, Ph:55310532, Cell:98492 35031. ● **NELLORE:** D.No.17/704, Chakali Veedhi, V.R.College Centre. Ph:2342347. ● **CHITTOOR:** II Floor, M.B.R.Complex, D.I.Road, Ph: 229821. Cell: 9440078539. ● **NALGONDA:** Opp: Kanakadurga Temple, RAMAGIRI. Cell: 9440828540. ● **HANMAKONDA:** 2nd Floor, Beside: C.P. Reddy Complex, Main Road, Chowrasta. Ph: 2571905, Cell: 9849499920. ● **ANANTAPUR:** Opp: Srinivasa Tutorial, Near: Raviteja Hotel Lane, Kamala Nagar. Cell: 9440200216. ● **VIZIANAGARAM:** 2nd Floor, Fathima Plaza, Near: R.T.C. Complex, Ph: 551210.

పై కేంద్రాలలో ప్రత్యక్ష శిక్షణలో చేరే విద్యార్థులు ఫీజు చెల్లించిన వెంటనే స్పోకెన్ ఇంగ్లీష్ డైరెక్ట్ కోచింగ్ మెటీరియల్ 7 పుస్తకాలు + KVR ఫోల్డర్ ఫైల్ ఉచితంగా అడిగి తీసుకోండి.



ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తున్నామయ్యా
అనధికార కనెక్షన్ల తొలగింపు
ప్రభుత్వం



అసమ్మతివాదులు దగ్గరికి రాకుండా రక్షణగానూ...
మోడీని తొలగించాలి ప్రసక్తి లేదు: అధిష్ఠానం

కార్టూన్ కదంబం



అప్పుడు పచ్చ చొక్కాలు, ఇప్పుడు ఖద్దరు చొక్కాలు అంతే తేడా...
జన్మభూమికి ప్రజాపథానికి స్పష్టమైన తేడా ఉంది -మంత్రి షబ్బీర్ అలీ
నారు



వివేకానందా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజూ ఒక గంట ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకున్నాను.

ఇప్పుడు నేనొక ఇంగ్లీషు న్యూస్ రీడరా అని అందరూ అడుగుతున్నారు.

మీ జీవితం కూడా మారాలంటే వివేకానందా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజూ ఒక గంట గడిపితే చాలు. గత 25 సంవత్సరాలలో 16 లక్షల ప్రజల జీవితం మెరుగుపడింది.

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకొని జీవితంలో పురోగమించటానికి మా ప్రత్యక్ష శిక్షణా కేంద్రంతో నేడే సంప్రదించండి.

HYDERABAD:

S. R. NAGAR	☎ 23714330
DILSUKHNAGAR	☎ 24044352
VANASTHALIPURAM	☎ 24122464
MEHDIPATNAM	☎ 55755888
A. S. RAO NAGAR	☎ 55497992
NARAYANAGUDA	☎ 55155441
RAJAMUNDRY	☎ 2422003
KAKINADA	☎ 2386638
VISAKHAPATNAM	☎ 2738892
VIJAYAWADA	☎ 5530053
GUNTUR	☎ 2238541
NELLORE	☎ 2327702
THIRUPATI	☎ 2252878
CUDDAPAH	☎ 224445
ANANTAPUR	☎ 241029
KURNOOL	☎ 248099
PRODDATUR	☎ 250550

డైరెక్టు కోచింగు క్లాసులలో చేరలేనివారు మా **'హోమ్ స్టడీ కోర్స్'** మూలంగా ఇంట్లో ఉంటూనే తీరిక సమయంలో ఈజీగా ఇంగ్లీషు నేర్చుకోవచ్చు. మొత్తం కోర్సు ఫీజు **రూ. 575/-** మాత్రమే. **(044) 24347034, 24341216** నెంబరుకి ఫోన్ చేస్తే చాలు. కోర్సు పాఠాలు **VPP** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వచ్చేస్తాయి.

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T.Nagar, Chennai-600017.

02 / TEL / 05/ NAGA

కొత్త పోప్ ఎవరు ?

జాన్‌పాల్ II కి సెలవు

వాటికన్ పీఠాధిపతి... జాన్‌పాల్ II ఇకలేరు. రోమన్ కాథలిక్ క్రైస్తవ ప్రపంచం శోక ప్రార్థనలతో వినమ్రంగా శిరస్సు వంచింది. సహోదర భావంతో సమస్త మత ప్రపంచం వారి శోకాన్ని పంచుకుంది. క్రీ.శ. 32-67ల మధ్య మొట్టమొదటి మతాచార్యుడుగా బాధ్యత స్వీకరించిన సెయింట్ పీటర్ నుంచి నేటికి 265వ పోప్‌గా ఇరవై ఆరు సంవత్సరాలు భారంమోసిన జాన్‌పాల్ II ఏప్రిల్ 2,ఆదివారం తెల్లవారుజామున మరణించారు. ఓ విశిష్ట వ్యక్తి మరణం, ఆ తదనంతరం ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనేది అందరి దృష్టిలో మెదులాడుతున్న అంశం.

అమ్మృత

పోప్ జాన్‌పాల్ II కు తల్లిదండ్రులు పెట్టిన పేరు కరోల్ వోజతిల. పోలెండులోని పారిశ్రామిక నగరమైన వడోవైస్‌లో పేదరికం విలయతాండవంచేసే కుటుంబంలో జన్మించారు. 1920లో ఆయన జన్మించిన సమయానికి తండ్రి సైన్యంలో పదవీవిరమణ తీసుకుని ఇంటికి వచ్చారు. బాల్యమంతా సమస్యల చిత్తడిలో పోరాటం సాగించాడు. అతని తల్లి మృతి చెందేనాటికి అతనికి తొమ్మిదేళ్ల వయస్సు. మరో మూడేళ్లు గడిచేసరికి సోదరుడు కూడా మరణించాడు. అక్కడి నుండి అతని కష్టాలకు రెక్కలొచ్చినట్లయ్యింది. సమస్యలన్నీ చెప్పుకుని వచ్చినట్లుగా ఒక్కసారిగా చుట్టుముట్టాయి. రోజులు గడిచేకొద్ది కష్టాలతో సహజీవనం చేయటం అలవాటైంది.

యుక్త వయస్సులో షేక్స్‌పియర్ రచనలతో పాటు పోలిష్ నాటకాన్ని ఊరూరా ప్రదర్శిస్తూ పోలెండ్ మొత్తాన్ని చుట్టివచ్చారు. అభినయం, వాచకవిన్యాసాలతో ప్రేక్షకులను ఆకర్షించటం ఆనాటి నుండే అలవాటైంది. ఆయన భాషా శాస్త్రాన్ని అభ్యసించడానికి క్రాకో విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు. నాజీ సైన్యాలు క్రాకో విశ్వవిద్యాలయాన్ని ఆక్రమించడంతో చదువుకు గండిపడింది. నాజీల ఆగడాలకు ఆయన చలించిపోయారు. ఎన్నికష్టాలనైనా ఎదురించి చదువుకోవాలన్న ఆయనకు రోజుగడవటమే గగనమైంది. కడుపు నింపుకోటానికి ఆయన క్వారీలో, రసాయన కర్మాగారంలోనూ పనిచేశారు. నాజీలతో ఆయన పోరాడకపోయినా, వారిని విమర్శించడం సైతం ప్రాణాంతకంగా మారింది. పొంచిఉన్న ప్రమాదాన్ని ఎప్పటికప్పుడు పసికడుతూ, యూదులను రహస్య స్థావరాలకు చేర్చడంలో సహకరించేవారు. ఉరికొయ్యలు ఎక్కాల్సిన ఎన్నో కుటుంబాలు ఆయన సాహసంతో బతికిబట్టకట్టాయి.

1942లో తండ్రి మరణించాడు. అదే సమయంలో జర్మన్ లారీ ఆయన్ని ఢీకొని మృత్యువు అంచుల్లోకి తీసుకుపోయింది. ఈ సంఘటన ఆయన గమ్యాన్నే మర్చేసింది. అతనిలో ఆధ్యాత్మిక ప్రవృత్తి బలంగా స్థిరపడింది. దైవాన్వేషణ వైపు మనసు మొగ్గుచూపింది. మతాచార్యుడిగా జీవనం సాగించాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆధ్యాత్మిక శిక్షణ కోసం అండర్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ఎట్టకేలకు 1964లో మతాచార్య పదవిని స్వీకరించే అర్హత పొంది, రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ కోసం రోమ్ వెళ్ళారు. సనాతన క్యాథలిక్ తత్వాన్ని పరిపూర్ణంగా వివరించే ప్రజ్ఞ ఆయనకు పెద్దపీట వేసింది. ఆ సమయంలోనే ఆధ్యాత్మిక సువాసనలు వెదజల్లే .కవిత్యాన్ని, నాటకాలను రాశారు. వాటితో పాటు

ఇన్నేళ్ళలో ముగ్గురే నల్లజాతి పోప్‌లు

క్రీ.శ.189లో 14వ పోప్ సెయింట్ విక్టర్, క్రీ.శ. 311లో 32వ పోప్ సెయింట్ మిలిషిడిస్ నల్లజాతీయులు. క్రీ.శ. 492 లో ఎన్నికయిన నల్లజాతి పోప్ సెయింట్ గెలాసియస్ 'శాంతి తనయుడు-క్రైస్తవుల తండ్రి" అని పేరు తెచ్చుకున్నాడు.

తాత్త్వికచింతన పరిమళించే గ్రంథాలనూ వెలువరించారు. అటువంటి వాటిలో ప్రధానంగా పేర్కొనాల్సిన పుస్తకం 'క్రాసింగ్ ది త్రెషోల్డ్ ఆఫ్ హోప్'. తనకు ఇష్టమైన ఎస్కిమో పడవలో అప్పుడప్పుడూ విహరిస్తూ సేదతీరేవారు. ఆ సమయంలో తెడ్లను ఆయన శిలువ ఆకారంలో అమర్చి ప్రార్థన చేసేవారు. 1958లో ఓ రోజు తన ఎస్కిమో పడవలో విహరిస్తున్నప్పుడు తాను బిషప్‌గా ఎంపికైనట్లు వార్తను విని సంతోషించి, "ఎస్కిమో దోనెలో విహారానికి అడ్డు చెప్పనంతవరకూ ఆ పదవిని సంతోషంగా స్వీకరిస్తాను...' అన్నారట. బిషప్ పదవిలో ఆరేళ్లపాటు సేవలందించి 1964 క్రాకో ఆర్చ్‌బిషప్ స్థాయికి చేరుకున్నారు. ఆ సమయంలోనే ఆయన ఖ్యాతి వాటికన్‌కు వ్యాపించి కార్డినల్ పదవిలో నియుక్తులయ్యారు.

1978లో పోప్ పదవిలో కేవలం 33 రోజులు పనిచేసిన పోప్ జాన్‌పాల్ I, హఠాత్తుగా మరణించడంతో కార్డినల్స్ సిస్టిన్ చాపెల్‌లో సమావేశమయ్యారు. మొదటిరోజు అంతిమ నిర్ణయానికి రాలేకపోయారు. ఆ సమయంలో ఆయన గంటల తరబడి కాలాన్ని నిష్క్రియగా గడపలేక, మార్క్సిస్ట్ సిద్ధాంతానికి సంబంధించిన సమీక్షా గ్రంథాన్ని చదువుతూ కూర్చున్నారట. ఓ కార్డినల్ ఆయన వైఖరిని చూసి ఆశ్చర్యపోయారట. రెండవ రోజు సమావేశంలో పోలెండ్‌కు చెందిన ఈయన పేరు ప్రస్తావనకు వచ్చి పోప్‌గా ఎన్నికయ్యారు. ఇటలీకి చెందిన వ్యక్తులే పోప్ పదవికి ఎన్నికవుతూ వస్తున్న సంప్రదాయాన్ని 455 సంత్సరాల సుదీర్ఘకాలం తరవాత ఈయన తిరగరాశారు.

ప్రజల్లో మనిషిగా....

సెయింట్ పీటర్‌తో ఆరంభమైన క్యాథలిక్ మఠాధిపతుల పరంపరలో పోప్ జాన్‌పాల్ II స్థానం ప్రత్యేకమైనదని చెప్పాలి. యాక్సిడెంట్–హత్యాయత్నాలకు క్షతగాత్రుడైనా, తుంటి ఎముక మార్పిడికి గురైనా, వార్ధక్యం పైబడుతున్నా, పార్కిన్సన్స్‌వ్యాధి తన దేహాన్ని లొంగదీసుకుంటున్నా పట్టువీడని స్వభావం ఆయనిది. తన 84 ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సామాన్య ప్రజానీకాన్ని కలుసుకుని వారి కష్టసుఖాలు గురించి చర్చించేవారు. పోప్‌గా సేవలందించిన 26 ఏళ్ళలో 120 దేశాలను సందర్శించారు. 1998లో క్యూబా దేశంలో అడుగుపెట్టిన పోప్ నెత్తిన స్కల్ క్యాప్, చేతిలో శిలువతో విమానం దిగి ముందుగా మోకరిల్లి భూమాతను చుంబించారు. ఇది ఆ దేశ విముక్తిఉద్యమాలకి పరోక్షంగా తన ఆశీస్సులు, గౌరవాన్ని తెలియజేసే పద్ధతి. ఏ దేశంలో అడుగుపెట్టినా ఆయన స్టైల్ ఇదేరీతిలో ఉంటుంది. క్యూబా పట్ల అమెరికా తీసుకున్న దిగ్బంధనా చర్యలను ఆయన నిశితంగా విమర్శించారు. అటువంటి వ్యక్తి ఉత్తర తైమూర్‌ను సందర్శించినప్పుడు తన మామూలు పద్ధతిలో వ్యవహరించలేదు. తైమూర్ నేలను ముద్దాడటమంటే అక్కడ ఇండోనేషియన్లు సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించినట్లవుతుందని, అ నేలపై శిలువనుంచి, ఆ పవిత్ర చిహ్నాన్ని మాత్రమే ముద్దాడారు.

పోప్‌పై హత్యాప్రయత్నం

1981మే 13న జీప్‌లోనిలబడి సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో భక్తులకు అభివాదం చేస్తుండగా మహ్మద్ ఆలీ ఆగా అనే టర్కీ యువకుడు ఆయనపై రెండుసార్లు కాల్పులు జరిపాడు. ఒక బులెట్ ఆయన పొత్తికడుపులో, మరొకటి ఎడమచేయి చూపుడు వేలుని గాయపరిచాయి. మహ్మద్ అలీ ఆగాను ఆయన స్వయంగా చూడటానికి జైలుకు వెళ్లి క్షమాభిక్ష ప్రసాదించారు. ఆ తర్వాత ఆయన భద్రత కోసం ప్రత్యేకంగా 'పోప్ మొబైల్' ఏర్పడింది.



క్యూబా అధ్యక్షుడు కాస్ట్రోతో

పోప్ అంతిమ ఘడియల తర్వాత

పోప్ అంతిమ ఘడియల్లో ఉండగా ఫొటోలు తీయడం, ఆయన ప్రకటించే సందేశాన్ని రికార్డు చేయటం నిషిద్ధం. 1958లో పోప్ పయస్ XII మరణశయ్యపై ఉండగా ఇటాలియన్ డాక్టర్ ఫొటోలను తీసి మీడియాకు అమ్మి సొమ్ముచేసుకున్నాడు. అప్పటి నుండే ఈ నిషేధం అమలుపరిచారు. పోప్ మరణించిన వెంటనే ఆయన వేలికున్న ఉంగరాన్ని తొలగిస్తారు. పవిత్ర జలాన్ని ఆయన దేహంపై చిలకరిస్తారు. వెండి సుత్తితో ఆయన నుదిటిపై మూడుసార్లు తాటిస్తారు. ఆయన అప్పటి వరకు నివాస భవంతిని సీజ్ చేస్తారు. ఆయన ఆశీనులైన కుర్చీలో మరొకరు కూర్చోకుండా దాన్ని విరగ్గొడతారు. పోప్ వ్యక్తిగత ఆస్తికి సంబంధించి ఆయన వీలునామా రాస్తే ఆ ప్రకారం అమలుచేస్తారు.

విమర్శల శిలువపై...

ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షకుడిగా పోప్ జాన్‌పాల్ II పేరు పొందారు. కానీ, మహిళలకు సంబంధించినంత వరకు పోప్ ఆలోచనలు ఐదో శతాబ్దానికి చెందినవని విమర్శకు గురయ్యారు. మహిళలకు చర్చి నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు ఒప్పుకునేవారు కాదు. గర్భనిరోధం, కండోమ్‌లు, గర్భస్రావం వంటి వాటిని ఆమూలాగ్రం గర్హించారు. చర్చి వ్యవహారాల్లో మహిళకు క్రియాశీలక భూమిక కట్టబెట్టిన రెండో వాటికన్ కౌన్సిల్ సంస్కరణల్ని కూడా వెనక్కి తీసుకునేందుకు పోప్, ఆయన ఛాందస సలహాదారులు ప్రయత్నించారన్న ఆరోపణలున్నాయి. సంప్రదాయాలకు పెద్దపీట వేసే మిస్టర్లకే పోప్ అధిపత్యంలో ప్రధాన్యత లభించింది. దాంతో చర్చికి, ఆధునిక ప్రపంచానికి మధ్య సాగిన ఘర్షణలో ఆధునిక మహిళల నుంచే పోప్ తీవ్ర



విమర్శలకు లోనయ్యారని వాషింగ్టన్‌కు చెందిన లిబరల్ క్యాథలిక్ గ్రూప్ అధ్యక్షురాలు ఫ్రాన్సెస్ కిస్లింగ్ అన్నారు.

1982 జూన్ 7న అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌తో వాటికన్ లైబ్రరీలో జరిగిన సమావేశం ఓ చర్చనీయాంశం అయింది. పెట్టుబడీదారీ సమాజం సహజంగానే కమ్యూనిజాన్ని ఓ భూతంగా భావించింది. సమసమాజ సిద్ధాంతం ప్రపంచవ్యాపితంగా ఉన్న క్రిస్టియన్‌లలో అత్యధికులైన శ్రామికులు, అట్టడుగు జాతులవారికీ మేలుచేకూర్చేదే. కానీ మత పెద్దలు, పీఠాధిపతులు సమసమాజ భావజాలానికి వ్యతిరేకంగా ఉండటం రాజ్యంతో, రాజ్యాధికారంతో ముడివేసుకునే ఉండటాన్ని తెలియజేస్తుంది. రీగన్‌తో సంభాషణల్లోనూ పోప్‌జాన్‌పాల్ గొంతు కలపడమే కాదు. పోలెండును సోవియట్ రష్యా ప్రభావాన్నించి తప్పించే పనిలో సాయపడాలనుకున్నారు. పోలెండుని కమ్యూనిస్టేతర దేశంగా మార్చి సోవియట్ యూనియన్ పక్కలో బల్లెంలా మార్చాలనే రీగన్ ప్రతిపాదనకు ఊతమయ్యారు. పోలెండ్‌ను గనుక అలా చేయగలిగితే మిగిలిన తూర్పుయూరప్ దేశాలన్నీ ఆ బాటన నడుస్తాయని ఈ



ఇద్దరు భావించారు. క్రిస్టియన్ డెమాక్రటిక్ మెజారిటీ చర్చితో పాటు ముందుకు వస్తే "కాథలిక్ మెంబర్‌షిప్ ఆఫ్ సాలిడారిటీ" ఒక శక్తివంతమైన రాజకీయశక్తిగా రూపొందుతుందని పోప్ భావించారు. వీరిద్దరి చర్చల సారాంశాన్ని టైమ్స్ పత్రిక "ఓ పవిత్ర కలయిక" అని వ్యాఖ్యానించింది. ఆ సమావేశం తరువాతే కాథలిక్ మతపీఠానికి కేంద్రమయిన వాటికన్ సిటీకి "ప్రత్యేక ప్రతిపత్తి"ని అమెరికా కల్పించింది. ఆనాటినుండి వాటికన్ ఓ ప్రత్యేక దేశం.

వాటికన్

ఇటలీ దేశంలోని రోమ్‌లో "వాటికన్" స్వయం ప్రతిపత్తిగల దేశంగా కొనసాగుతోంది. దీని రాజధాని వాటికన్ సిటి. దేశ విస్తీర్ణం 0.4 చ.కి.మీ. జనాభా పరంగా చూస్తే 900 మంది మాత్రమే. లాటిన్, ఇటాలియన్ భాషలు మాట్లాడినా దాదాపు ప్రపంచంలో ప్రధానంగా గుర్తింపుపొందిన అన్ని భాషల్లో అక్కడ సంభాషణలు జరుగుతాయి. అందుకే వాటికన్ రేడియో 34 భాషలో ప్రసారం చేస్తోంది. ఇక్కడ ప్రత్యేక పోలీస్, న్యాయ వ్యవస్థలు కొనసాగుతున్నాయి. అంతేకాదు ప్రత్యేక పోస్టల్ వ్యవస్థ కూడా సేవలందిస్తోంది.

సామరస్యతకై...

పూర్వం క్రైస్తవ-ముస్లిం మతాల మధ్య మత వ్యాప్తికోసం క్రూసేడ్స్ జరిగేవి. అటువంటి పరిణామాలు ఈ ఆధునిక యుగంలో చోటుచేసుకోకుండా పోప్ అనేక సందర్భాల్లో ముందుగానే స్పందించారు. పోప్ జాన్‌పాల్ II హయాంలో క్యాథలిక్- ముస్లిం సంబంధాలు గణనీయంగా మెరుగయ్యాయి. మత సామరస్య విధానాల ద్వారా పోప్ జాన్‌పాల్ ఈ రెండు వర్గాల ప్రజలమధ్య సంఘర్షణాస్థానే సహకారాన్ని పాదుగొల్పారు. నూటపది కోట్లకుపైగా ఉన్న క్యాథలిక్‌లు, నూట ఇరవై కోట్లకుపైగా ఉన్న ముస్లిం మధ్య సామరస్యాన్ని పోప్ సాధించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి నేపథ్యంలో ఈ రెండు మతాలమధ్య సంఘర్షణలు తలెత్తకుండా పోప్ నివారించగలిగారు. ఇరాక్‌పై అమెరికా దాడిని పోప్ ఖండించడం ఇస్లాం ప్రపంచానికి కొంత ఊరట కలిగించింది. ఇరాక్ బాల్కన్ యుద్ధాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తీనియన్ల కష్టాలను గర్హించారు. సిరియా పర్యటన సందర్భంగా మసీదును కూడా సందర్శించారు. డమాస్కస్‌లోని ఒమయ్యాబ్ మసీదు సందర్శించి చరిత్ర సృష్టించారు.

కొత్తపోప్ ఎన్నిక ఇలా...

పోప్ ఎన్నిక ఒకే విడతలో జరిగే వ్యవహారం కాదు. మూడింట రెండువంతుల పైచిలుకు ఓట్లను పొందిన వ్యక్తినే ఆ పదవి వరిస్తుంది. వాటికన్ అధిపతిని ఎంపిక చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా చెబుతుంటారు. గతంలో గ్రెగరీని పోప్‌గా ఎన్నుకోవడానికి మూడేళ్ళు పట్టింది. అయితే గత 100 ఏళ్ళుగా ఐదురోజుల్లోనే వారసుని ఎంపిక జరిగిపోతోంది. ఎందుకంటే ఇప్పుడు కార్డినల్స్‌ను గతంలో లాగా ఇరుకు గదిలో కాకుండా విశాలమైన భవనంలో ఉంచుతున్నారు. ఈ భవనంలో 108 గెస్టు సూట్‌లు, 23 సింగిల్ రూమ్‌లు ఉన్నాయి. 1996లో అప్పటి జాన్‌పాల్ యూనివర్సిడొమినిసి గ్రెగిస్ పేరుతో సవివరమైన ఎంపిక ప్రక్రియను రూపొందించారు. దీని ప్రకారం 80 ఏళ్ళ లోపు ఉన్న కార్డినల్స్ అందరూ ఓటు వేయవచ్చు. ప్రస్తుత పోప్ వారసుడి ఎన్నికల్లో వివిధ దేశాలకు చెందిన 117 మంది పాల్గొంటారు. ఎన్నిక తేలక ఎవరికీ మెజారిటీ రాకపోతే, మొదటి స్థానంలో ఉన్న ఇద్దరినుండి పోప్‌ను ఎన్నుకుంటారు. పోప్ చనిపోయిన 15, 20 రోజుల లోపు ఈ ఎన్నిక ప్రక్రియ జరగాలి. ఎన్నిక రహస్యంగా జరుగుతుంది. ఇక్కడి వారికి టెలిఫోన్ సౌకర్యం కూడా ఇవ్వరు. ప్రతి కార్డినల్ స్వహస్తాలతో తాను ఎంచుకున్న వ్యక్తి పేరు బ్యాలెట్‌పై రాయాలి. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ బ్యాలెట్ పత్రాలను తగులబెడతారు. అంటే వాటికన్ ప్యాలెస్ నుండి నల్లని పొగ వెలువడితే పోప్ ఎన్నియినట్లే. పోప్‌గా ఎన్నికయిన వ్యక్తిని కార్డినల్స్ నాయకుడు పిలిచి 'పోప్‌కావడం నీకు ఇష్టమేనా?...' అని అడుగుతారు. దానికా వ్యక్తి సమ్మతిస్తే ఏ పేరుతో పిలవాలని అడుగుతారు. తనకు నచ్చిన పేరును ఆ వ్యక్తి చెపితే అదే పోప్‌పేరుగా నిర్ణయమవుతుంది. తర్వాత పోప్ ఎన్నిక విషయం ప్రపంచానికి తెలియజేస్తారు. వెంటనే కొత్త పోప్ వాటికన్ భవనం బాల్కనీ నుంచి ప్రజలను ఆశీర్వదిస్తారు.

పోప్‌ల పేర్లలో పయస్, జాన్, పాల్...

పోప్‌గా ఎన్నికయినవారు తాము పెట్టుకునే కొన్ని పేర్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో 'జాన్' అనే పేరును 22 మందికి పైగా పెట్టుకున్నారు. దీనికి కారణం లేకపోలేదు. క్రైస్తవుల పవిత్రగ్రంథమైన బైబిల్‌లో జాన్ అనే వ్యక్తికి ప్రత్యేక స్థానంఉంది. ఇతను జాలరి. ఏసుక్రీస్తుకు ప్రియమైన శిష్యుడు. రేయింబవళ్ళు క్రీస్తు వెంటే ఉండేవాడు. బైబిల్ గ్రంథంలో చివరిదైన ప్రకటనలు అనే పుస్తకాన్ని రచించాడు. వృద్ధాప్యంలో ద్వీపాంతర శిక్షకు గురై మరణించాడు.

'పాల్' పేరును కూడా దాదాపు పదిమంది పోప్‌లు పెట్టుకున్నారు. క్రీస్తు శిలువ మరణం తర్వాత మతమౌఢ్యంతో క్రైస్తవులను నరకయాతనలు పెట్టినవాడు పాల్!. అనూహ్యంగా ఇతను క్రైస్తవునిగా మారి బైబిల్‌లోని 66 పుస్తకాల్లో 14 పుస్తకాలు ఈయనే రచించాడు. దీంతో అక్కడ ప్రజలు క్రైస్తవ మతంపైపు మొగ్గుచూపటంతో రోమన్ చక్రవర్తులు ఈయనకు శిరచ్ఛేదన శిక్ష విధించి అమలుజరిపారు. ఇక 'పయస్' పేరును 12 మంది పెట్టుకున్నారు. బైబిల్ మొత్తం తిరగేసినా ఈ పేరు ఎక్కడా కనిపించదు. అయినప్పటికీ ఈ పేరుగల వ్యక్తికి అంత ప్రాముఖ్యం ఎలా వచ్చిందందనేది ప్రశ్న. క్రీస్తు మరణానంతరం రోమన్ సామ్రాజ్యంలో క్రైస్తవులని చెప్పుకోటానికే భయపడేవారు. ఎక్కడివారినక్కడ ఊచకోతకోసే రోజులో పయస్ అనే వ్యక్తి క్రైస్తవులను రక్షించుకోటానికి అహర్నిశలా కృషిచేశాడు. పయస్ మాదిరిగా ఆదర్శంగా ఉండాలనే ఆశయంతో పోప్‌లు ఈ పేరును ఇష్టపడ్డారు.

266వ పోప్ ఎవరో?!

పోప్‌గా బాధ్యత నిర్వర్తించిన జాన్‌పాల్ II శాశ్వత సెలవు తీసుకున్నారు. తమ పవిత్ర మతగురువు పరమపదించారని ఎంత ఆవేదనగా ఉన్నారో... కొత్తగా ఎవరు ఎన్నికవుతారా అని అంతే ఉత్కంఠతో ఉన్నారు. మతాన్ని, మత పవిత్రతను రాజకీయాలతో మిళితం కాకుండా ఉండాలనే ఆశిస్తున్నారు. దీనులకోసం, క్షుదార్తులకోసం ఆస్ట్రేలియన్ ఫాదర్ గ్రాహమ్ స్టెయిన్స్ లాంటి త్యాగశీలతను పెంపొందించే పోప్‌కోసం వారెదురు చూస్తున్నారు. తన భర్త హంతకులకు క్షమాభిక్ష పెట్టమన్న గ్లాడిస్ స్టెయిన్‌లాంటి వారు చూపిన క్షమాగుణం వెదజల్లే మానవీయ పోప్‌ను ఊహించుకుంటున్నారు. "ఓ ప్రభువా అలాంటి మహోన్నతుణ్ణి మాకు పోప్‌గా ప్రసాదించు" అని ప్రార్థిస్తున్నారు. ✤



"ఆహా! చప్పట్లే... చప్పట్లు"

చెమికల రాజశేఖర రెడ్డి

ఆయన ఎలాగో వున్నారు. మొహంలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగాలుగా వున్నారు.

ఆయనంటే ఆయన ఒకాయనా... ఇద్దరా... ముగ్గురా అని కాదు. ఆయన ఎందరికో ఒక నమూనా. ఆయనలాంటి వాళ్ళే మనకు చాలా చోట్ల కనబడుతూ ఉంటారు.

రాత్రి నిద్రలేకపోవడంవలన ఆయన మొహం వాచినట్టుగా వుంది. కొద్దిసేపు తన గదిలో అటూ ఇటూ పచార్లు చేశారు. కాళ్ళు నొప్పెట్టడంతో కుర్చీలో కూలబడ్డాడు.

"ఇంతవరకూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు" అని అప్పటికే వందోసారి ఆయన తన మనసులో అనుకున్నాడు.

కుటుంబసభ్యులు ఆయన్ని పలకరించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయన మనసులోని బాధను కనుక్కోడానికి ప్రయత్నించారు. ఆర్థిక సమస్యలు ఆయన్ని చుట్టుముట్టడానికి అవకాశమే లేదు. ఆయన బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు కావాల్సినంత వుంది. ఆయనకు అంతగా డబ్బు అవసరమయితే ఇవ్వడానికి ఆయన కుటుంబ సభ్యులు రెడీగా వున్నారు. బయటికెళ్ళడానికి కారు వుంది. సినిమాలవీ చూడడానికి ఇంట్లోనే హోమ్ థియేటర్ ఎరేంజ్ చేసుకున్నారు. ఎంటర్‌టెయిన్ చేయడానికి టీవీ ఛానెళ్ళు రెడీగా వున్నాయి. కుటుంబసభ్యుల్లో ఎవరికైనా అనారోగ్యమా... అంటే అదీ లేదు. కొడుకులు, కూతుళ్ళు చక్కగా స్థిరపడ్డారు. బహుశా ఆయనకేదైనా అనారోగ్య సమస్య వచ్చిందేమోనని కనుక్కోడానికి కుటుంబసభ్యులు ప్రయత్నించారు.

"నాకేమయింది దుక్కలా వున్నాను. నా ఆరోగ్యం బాగానే వుంది. నన్ను డిస్టర్బ్ చేయకండి" అని నారాయణ కుటుంబసభ్యులమీద విసుక్కున్నారు.

టెలిఫోన్ వైపు చూశారు. ఈ మధ్యన టెలిఫోన్ కాల్స్ తనకు రావడం తగ్గిపోయాయి. ఎందుకిలా జరుగుతోంది... రెండు రోజులుగా ఆయన పూర్తిగా బయటకు వెళ్ళడమే లేదు. పోస్టుమేన్ వస్తాడేమో ఉత్తరాలు వస్తాయేమోనని ఆ టైములో బయటకొచ్చి వరండాలో పచార్లు చేశారు. పోస్టుమేన్‌కూడా రాలేదు. ఆయన ఎవరికోసం ఎదురు చూస్తున్నాడో కుటుంబసభ్యులకు అర్థం కాలేదు. ఉదయమే పదిగంటలకల్లా ఇంట్లోనుంచి బయటపడి రాత్రి ఏ పదింటికో ఇంటికొచ్చి శాలువాలు, దండలు, జ్ఞాపికలు బల్లమీద పెట్టి భార్యవైపు గర్వంగా చూసే ఆయన గత రెండు రోజులుగా నిద్రలేమితో బాధపడుతున్నారు. ఆయన పేరు ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం హైద్రాబాద్‌లోనే కాదు మొత్తం రాష్ట్రమంతా చాలామందికి తెలుసు. కారణం ఆయన పేరు, ఆయన ఫొటో ప్రతిరోజూ పత్రికల్లో కనిపిస్తూనే వుంటుంది. ఆయనేమీ రాష్ట్ర ముఖ్యమంత్రి కాదు, గవర్నరు కాదు. కనీసం హోమ్‌శాఖామంత్రి కూడా కాదు. సినిమా నటుడు అంతకన్నాకాదు. కానీ ఆయన రోజుకు నాలుగైదు సభలకు హాజరవుతూనే వుంటారు. ఆయన ఛరిష్మా అలాంటిది. సాహిత్య, సాంస్కృతిక సభలకే కాదు, పిలిస్తే "లం.మే.సం." వారిసభలకు కూడా వెళ్ళి 'లంచం మేయడంలో ఆదర్శనీయత-కళాత్మకత' అనే అంశం మీద అరగంటసేపు ఏకబిగిన ఉపన్యాసం దంచేస్తారు. వేదాల్లోనూ పురాణవీధుల్లోనూ ఆమ్యామ్యాల మీద అనర్గళంగా మాట్లాడి అపరలంచావతారుల్ని ఆకట్టుకునే అభినివేశం ఆయన సొత్తు.

గత రెండు రోజులుగా ఆయన మానసిక ఆరోగ్యంలో ఎందుకు తేడా వచ్చిందో, ఈపాటికి పూర్తిగా అర్థమయ్యే వుంటుంది. ఎందుకో ఈ మధ్యన ఆయన్ని సభాధ్యక్షత వహించమనో, ముఖ్య అతిథిగా వుండమనో, వేదిక మీద ఏదో ఒక ప్రధాన పాత్ర పోషించమనో అడిగే సాహిత్య, సాంస్కృతిక సంఘాల సంఖ్య గత రెండు నెలలుగా క్రమక్రమంగా తగ్గిపోతోంది. రెండు రోజులనుంచయితే ఒక్కటంటే ఒక్క సభకూడా లేకుండాపోయింది. రెండు మూడు రోజులుగా భోజనం లేకపోతే ఎలా వుంటుందో అలా వుంది ఆయన పరిస్థితి.

నగరంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సభలు జరగడంలేదా అంటే అదేమీ లేదు. పేపర్లలో వార్తలనుబట్టి చూస్తే బ్రహ్మాండంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. తనతో బాగా దగ్గరగా వుండి, తన సహాయాన్ని పొందిన సంస్థలు కూడా సత్కార సభలు, అభినందన గోష్ఠులు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు చేపడుతూనే వున్నాయి. కానీ తనకు మాత్రం ఆ సంస్థలనుంచి సభాధ్యక్షునిగా వుండమంటూ పిలుపు రాలేదు.

"వీళ్ళకేమి మాయరోగం వచ్చింది. ఇక నావలన పెద్దగా సహాయం వుండదనుకొని కొత్తవాళ్ళను చూసుకున్నారేమో... ఏమిటో వెధవలు" అని ఆయన తన మనసులో అనుకున్నారు. "ఎక్కడో ఏదో జరిగింది" అని బయటికి గట్టిగానే అన్నారు.

రెండు రోజులనుంచి నిద్రలేకపోవడంవలన కళ్ళు కూడా ఎర్రగా వున్నాయి. సర్వ సభాధ్యక్షులుంగారి పరిస్థితి.కొంతలో కొంత ఆయన సహధర్మచారిణికి అర్థమయింది. ఆయనకు నిద్రపట్టడానికి ఏదైనా మార్గం చూడాలని ఆమె అనుకున్నది.

"ఏమండీ అలా మా పెద్దన్నయ్య ఇంటి దగ్గరకు వెళదామా!

చాలా కాలమయింది వాళ్ళింటికి వెళ్ళి. 'బావగారు మా ఇంటికి రానే రారు ఎప్పుడూ బిజీనే. రిటైరయిన తర్వాత కూడా ఇంటి పట్టున వుండకుండా ఎప్పుడూ ఆ రవీంద్రభారతిలోనో, త్యాగరాయ గానసభలోనో, ఎన్టీఆర్ కళాభవన్‌లోనో... లేదా మరే చిన్నా చితకా వేదికలమీదనో ఉపన్యసిస్తూనో, పుస్తకాలు ఆవిష్కరిస్తూనో, సన్మానాలు పొందుతూనో-చేస్తూనో కనిపిస్తుంటారు. పొద్దున లేచిన దగ్గరనుంచి బయటవాళ్ళతోనే వుంటారు తప్ప అయినవాళ్ళ గురించి పట్టించుకోనే పట్టించుకోర'ని మా అన్నగారు తెగ బాధపడిపోతున్నాడు. ఈరోజన్నా వాడింటికి వెళదామా" అంది. ఆవిడ కాస్త కోపంగానే అన్నప్పటికీ స్పష్టంగా చెప్పింది.

ఆయన మొహంలోకి ముసలి వేడినెత్తురు పొంగుకొచ్చింది. మొహంమీది కండరాలు అదిరాయి. అయినా ఏమీ అనలేకపోయాడు. కోపంగా భార్యవైపు చూసి "సరే అలాగే, తయారవ్వు. తగలడదాం" అని భార్యను కసిరాడు.

ఆమె మొహంలో సంతోషం వెలిగింది. "హమ్మయ్య... ఇంతకాలానికి నా మాట విన్నాడు. ఏమిటో పాడు సభలు. నేను ప్రధానమంత్రినయితే దేశంలో ఎలాంటి సాహిత్య సాంస్కృతిక సభలు జరగడానికి వీలులేదని ఒక చట్టాన్ని తెద్దును" అని ఇదివరకు అనుకున్నట్టు, ఈసారి కూడా ఆవిడ అనుకుంది.

ఇంతలో ఫోను మోగింది. సదాసభాధ్యక్షులవారి భార్య గుండె దడ పెరిగింది. ఆయనకేదైనా ఆహ్వానం అందుతుందేమో తాము బయటకు పోవడం కుదరదేమోనని ఆమె గాబరాపడింది.

స.స.అ.గారు పరుగెత్తినట్టుగా ఉరికి ఆ ఫోన్‌నందుకున్నారు. అవతలివైపు గొంతు వినగానే ఆయన మొహంలో మరింత నిరుత్సాహం పెరిగింది. ఆ ఫోన్ కొడుకు కోసం వచ్చింది.

ఎట్టకేలకు ఆ దంపతులు కారులో ఆయన బావమరిది ఇంటికి బయలుదేరారు. అక్కడ కూడా ఆయన అన్యమనస్కంగానే వున్నారు. ఇంటికి తిరిగొచ్చిన తర్వాత కూడా ఆయనకేమీ తినాలనిపించలేదు. ఏదో తినాలంటే తినాలన్నట్టుగా కాస్త గతికి నిద్రపోవడానికి ప్రయత్నించాడు. నిద్రరాలేదు. తెల్లారింది.

మూడో రోజు కూడా ఆయన్ని ఏ సాంస్కృతిక సంస్థా పిలవలేదు. శరీరం తిమ్మిరెక్కినట్టుగా అయింది. కడుపులో వికారంగా వున్నట్టు అనిపించింది. రెండుమూడు సార్లు కళ్ళలో నీళ్ళు కూడా వచ్చాయి గానీ బాగోదని ఏడవకుండా నిబ్బరంగా వుండిపోయారు. అంతగా అవసరమయితే బాత్‌రూమ్‌కు వెళ్ళి వెక్కి వెక్కి ఏడవాలనుకున్నాడు.

రాష్ట్రవ్యాప్తంగా అప్పుడప్పుడు రాష్ట్రాన్ని దాటి జరిగిన వేలాది సభలను అలరించిన స.స.అ.కు గడ్డుకాలం వచ్చినట్టే వుంది. అనారోగ్యంతోనో, వృద్ధాప్యంతోనో వేటాడలేని సింహం దిగాలుగా గుహాలోనే కూర్చొని పాత ఎముకలను చప్పరించినట్టుగా, ఆయన తన రూములో కూర్చుని ఇంటినిండా పేరుకుపోయిన వందలాది వేలాది మెమెంటోలను చూస్తూ గతస్మృతుల్ని నెమరేసుకున్నారు. ఏ సభలో ఎలా ఉపన్యసించిందీ కాసేపు జ్ఞాపకం చేసుకున్నారు. అయినప్పటికీ ఆయన విచారం తొలగిపోలేదు.

పత్రికల్ని చూడాలనిపించలేదు. ఎందుకంటే వాటిని చూస్తే వివిధ నగరాల్లోని సాహిత్య, సాంస్కృతిక సందడి కళ్ళముందు కనపడుతుంది. తన స్థానాన్ని ఆక్రమిస్తున్న కళాబంధువుల(గిట్టనివాళ్ళు వీళ్ళని కళా రాబందులు అంటారు)వెలిగిపోతున్న మొహాల్ని చూడలేక ఇబ్బంది పడాలి... ఎందుకొచ్చిన బాధని పత్రికలవైపు చూడడం కూడా మానేశారు స.స.అ. సిగ్గువిడిచి పిలవకపోయినా ఆయన కార్యక్రమాలకు వెళ్ళి తనకై తాను సభల్లో ఒక ప్రేక్షకునిలా కూర్చోలేదు. ఎలాగో వుంటుంది. తెలిసినవాళ్ళు స్టేజీమీద తాను లేకపోవడాన్ని తనకే గుర్తు చేసి అప్పటికప్పుడే అయ్యో అని తన ముందే శాడిస్టిక్‌గా తమ బాధను వ్యక్తపరచొచ్చు. ఏం చేయాలో నారాయణకు తోచడం లేదు. హఠాత్తుగా ఆయన మదిలో ఒక ఆలోచన తట్టింది.

తనే ఒక సంస్థను స్థాపించి, తనే కనీసం వారానికొకటయినా ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి ఆ విధంగా సభాసరస్వతికి నమస్కారం చేసి ఉపన్యాసం దంచొచ్చు కదా అనుకున్నాడు. స్పాన్సర్లు చేసే సంస్థలెన్నో తనకు తెలుసు. తనకూ డబ్బుకు ఇబ్బంది లేదు. వీలయినప్పుడల్లా తన డబ్బుకూడా ఖర్చు పెట్టొచ్చు. ఆ విధంగా పాత కొత్త స్నేహితుల కలయికతో తిరిగి తను జనజీవన స్రవంతిలో కలవొచ్చని అనుకున్నారు. అలవాటు ఎక్కడ పోతుందోనని అప్పుడప్పుడు "సభకు నమస్కారం" అనుకుంటున్నారు. కానీ ఆలోచించగా ఆలోచించగా ఇది సరైన ఆలోచనగా ఆయనకు అనిపించలేదు. రెండు మూడు సభల తర్వాత పత్రికల్లో గిట్టనివాళ్ళు విమర్శలు గుప్పిస్తారు. ఇతరుల ఆహ్వానాల మేరకు సభలకు హాజరయి కీర్తిని మూటగట్టుకోవాలి తప్ప సొంతడబ్బు ఖర్చుపెట్టుకొని ఎంతకాలమని ముందుకు పోగలం? ఎలా సొంత డబ్బా వాయించుకోగలం... అనిపించింది. దాంతో ఆ ఆలోచన నుంచి విరమించుకున్నారు.

అప్పటికే వారం రోజులయింది. తిండి సరిగా తినకపోవడంవలన వారు తెగ నీరసించి పోయారు. రాత్రిళ్ళు సరిగా నిద్రలేకపోవడంవలన ఆయన సగానికి సగం అయిపోయారు. కుటుంబ సభ్యులందరూ కలిసి బలవంతంగా ఆయన్ని డాక్టరు దగ్గరకు తీసుకుపోయారు. వారి ఫ్యామిలీ డాక్టరు సుబ్రమణ్యం పరిశీలించి, అన్ని పరీక్షలు నిర్వహించి ఎలాంటి అనారోగ్యం లేదని, మరిన్ని అత్యాధునిక పరీక్షలు చేయిస్తే మానసికపరమైన ఆందోళనకు, నిద్రలేమికి కారణమేమిటో తెలుస్తుందని తెలిపారు. ఆయనను తన రూములోనే కూర్చోబెట్టి పక్క గదిలో ఆయన కుటుంబసభ్యుల్ని డాక్టరు అనేక ప్రశ్నలు వేశారు. మొత్తం సమాధానాలన్నిటి సారాంశాన్నిబట్టి ఒక నిర్ణయానికి వచ్చారు. తన స్నేహితుడు, క్లినికల్ సైకాలజిస్టయిన ప్రముఖ మానసికశాస్త్రవేత్త శరత్‌ను రప్పించాడు. డాక్టరు సుబ్రమణ్యం సర్వసభాధ్యక్షులవారి పరిస్థితిని డాక్టరు శరత్‌కు వివరించాడు.

"వారంరోజులుగా ఎలాంటి వ్యాపకాలు లేకపోవడంవలన ఈయనకు పిచ్చిపట్టినట్టుగా వుంది... ఇదేమంత పెద్ద సమస్య కాదు. తిరిగి ఆయన తన వ్యాపకాల్లో కూరుకుపోతే మరలా మామూలు వ్యక్తవుతాడు" డాక్టర్ శరత్ తేల్చేశాడు.

"నీకు తెలియనిదేముంది. ఆయన ఏకైక వ్యాపకం పొద్దున్నుంచి సాయంత్రదాకా ఐదారు సభావేదికల్ని అలరించడం. గత వారం రోజులుగా రోజుకు కనీసం ఒక సభకూడా లేకపోవడంవలన మానసిక పరిస్థితిలో తేడా వచ్చింది. పగలు ఎలాగో గడిచిపోతోంది. ఏదో తింటున్నాడు. కానీ రాత్రయితే చాలు ఆయన ప్రవర్తనలో విపరీతంగా మార్పులు వస్తున్నాయి. సాయంత్రం ఆరు ఆరున్నరనుంచి పది దాకా పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడట. సభాసరస్వతికి నమస్కారం... అంటూ గట్టిగా అరుస్తున్నాడట. వున్నట్టుండి పెన్నును మూతి దగ్గర పెట్టుకుని ఏదో ఒక ఉపన్యాసం మొదలుపెడుతున్నాడట. నిద్రమాత్రలు వేసుకుంటేగానీ రాత్రి నిద్ర రావడం లేదట." డాక్టర్ సుబ్రమణ్యం డాక్టర్ శరత్‌కు చెప్పాడు.

"అవును! ఇరాక్‌లో డ్యూటీ నిర్వహించిన, నిర్వహిస్తున్న చాలామంది అమెరికా సైనికులు పిచ్చివాళ్ళయిపోతున్నారని ఈ మధ్యనే వార్తలు వస్తున్నాయి. ఇరాక్‌లో డ్యూటీ నిర్వహించలేక ఇంటికొచ్చిన తర్వాత కూడా పక్కలో బాంబులు పడ్డట్టుగా, "యూ ఇరాకీ" అంటూ అరుస్తూ జ్ఞాపకశక్తి కోల్పోయారుట. కొంతమంది అమెరికా సైనికులు మానసికరోగులుగా మారిపోయారట. ఆధిపత్యంకోసం, ఎప్పుడూ నంబర్‌వన్‌గా వుండాలనుకుంటూ నేనే సర్వం, అంతా నా ఆధిపత్యంలో, నా కనుసన్నల్లో వుండాలి, జరగాలనుకుంటూ హూంకరించేవారికి భవిష్యత్తులో పిచ్చి పడుతుందని కొన్ని పరిశోధనల ద్వారా తెలుస్తోంది. బహుశా ఈయన పరిస్థితి కూడా అలా తయారయింది. సాంస్కృతికరంగంలో ఈ సభాధ్యక్ష మహాశయులంగారి ఆధిపత్యానికి గండిపడడంవలన ఆయనలోని 'మెగలోమేనియా' వ్యక్తిత్వానికి గట్టి దెబ్బ తగిలి ప్రస్తుత పరిస్థితి దాపురించింది. దీనికి నా దగ్గర రెండే రెండు పరిష్కారాలున్నాయి. నగరంలోని సాంస్కృతిక సంస్థలన్నింటిని స.స.అ.గారి కుటుంబ సభ్యులు అభ్యర్థించి ,తిరిగి ఆయన్ని ఆయా సభలలో ఉపన్యసించేలా చేయాలి. ఆయన లాల్చీ జేబుల్లో కనీసం నాలుగైదు ఉపన్యాసాల కాగితాలు, ఆహ్వాన పత్రాలు ప్రతి రోజూ వుండేలా జాగ్రత్త తీసుకోవాలి. అది కుదరదనుకుంటే గుడ్డిలో మెల్లలా ఇంకో పరిష్కారం వుంది..."

"ఏమిటా రెండో పరిష్కారం..." నారాయణ కుటుంబసభ్యులందరూ ఒకేసారి అడిగారు.

"నారాయణగారు నిద్రపోయే గదిలో ఒక చక్కటి టేప్‌రికార్డర్‌ను, నాలుగైదు స్పీకర్లను అమర్చి ఆ టేప్‌రికార్డర్‌లో చప్పట్ల క్యాసెట్‌ను పెట్టాలి. ఆ చప్పట్ల శబ్దం ఇల్లంతా మోగితేగానీ ఆయనకు నిద్రరాదు. నిద్రవస్తే సగం రోగాలు మాయమయినట్టే నిద్రమాత్రలను రోజూ వాడడంవలన సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. కాబట్టి వున్నంతలో చప్పట్ల క్యాసెట్ ఐడియానే బాగుంటుంది..." డాక్టర్ శరత్ చెప్పడం ముగించాడు.

ఆ మరుసటి రోజు డాక్టర్ శరత్ చెప్పిన రెండో పరిష్కారానికే నారాయణ కుటుంబసభ్యులు ఓటేశారు. ప్రతి రోజూ సాయంత్రం ఆరుగంటలనుంచి మరుసటి రోజు తెల్లారేదాకా నారాయణ గదిలో చప్పట్లు వివిధ స్థాయిలలో మోగుతూనే వున్నాయి. దాంతో నారాయణ కళ్ళు మూసుకుని నిద్రకుపక్రమిస్తున్నాడు.

"శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు" అనుకుంది నారాయణ భార్య.

'ఏమయితేనేమి ఆయన కనీసం ఇంటిపట్టున వుంటున్నారు... అదే పదివేలు' అనుకొని మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంది ఆమె. ☆

సర్కస్ గుర్రం

పుప్పాల కృష్ణమూర్తి

మునావర్ జీవితమంతా గుర్రపు బండి తోలి బతికాడు. తన స్వగ్రామమైన సైదాపేట నుండి పది కిలోమీటర్ల దూరంలో వున్న పట్నానికి రోజూ ప్రయాణీకుల్ని చేరవేసేవాడు. అలా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవాడు. తాను బాగా వృద్ధుడవడంతో బండిని కొడుకు అన్వర్‌కు అప్పగించాడు. అన్వర్ బండి తోలడం మొదలు పెట్టిన నెల్లాళ్లకే గుర్రం జబ్బు చేసి మరణించింది. కొత్త గుర్రం కొనాల్సొచ్చింది. డబ్బు తీసుకుని సంతకు వెళ్తుండగా "నాయనా! బండి తోలిన గుర్రాన్ని తప్ప వేరేదాన్ని కొనకు. నీకింకా గుర్రాన్ని తోలడం అభ్యాసం కూడా కాలేదు. రోజూ నాలుగు రూపాయలు సంపాదించేలా వుండాలి. తక్కువ ధరని, గుర్రం బావుందని మరో దాన్ని ఖరీదు చేయకు" అని జాగ్రత్తలు చెప్పాడు తండ్రి.

అన్వర్‌కు సంతలో రకరకాల గుర్రాలు కనిపించాయి. కాని వాటి రేట్లు అందనంత ఎక్కువగా వున్నాయి. ఒక చోట మాత్రం రెండు వేలకే గుర్రాన్ని అమ్మకానికి పెట్టాడు మునీర్ అనే వ్యక్తి తన దగ్గరున్న డబ్బులకు సరిపడే గుర్రమదేననుకున్నాడు. వెంటనే "గతంలో ఇది ఏం పని చేసేది?" అని అడిగాడు అన్వర్ మునీర్‌ను. అందుకతను "ఇది, నేను సర్కస్ కంపెనీలో పనిచేశాం. కంపెనీ దివాళా తీయడంతో యజమాని డబ్బివ్వలేక గుర్రాన్ని నాకు అంట గట్టాడు. నేను ఏం చేసుకునేది! అందుకే అమ్మకానికి పెట్టాను. సర్కస్‌లో భలే ఫీట్లు చేసేది. సుఖంగా బతికింది. పాపం దీనికింక ఆ రాత లేదు. మీరు బండికి కట్టినా లాగుతుంది. ఒంటరిగా సవారీ చేయడానికైనా ఉపయోగపడుతుంది. తీసుకోండి. తక్కువ ధరకే ఇస్తాను" అన్నాడు.

"నాన్న జట్కా తోలిన గుర్రాన్ని తప్ప మరోటి కొనొద్దన్నాడు. అవేమో ధరెక్కువున్నాయి. రెండు వేలకు ముసలి గుర్రం వచ్చేలా వుంది. ఇదైతే యవ్వనంలో వుంది. బండికి కట్టి నెమ్మదిగా తోలుకుంటే దీనికే అభ్యాసం అవుతుంది. తీసుకుంటే పోలా సరసమైన ధర" అని మనసులో అనుకున్నాడు అన్వర్. రెండు వేలకు రెండు వందలు తక్కువ చేసి గుర్రాన్ని కొని ఇంటికి తీసుకుపోయాడు.

"సుఖంగా పెరిగింది. బండెలా లాగుతుందిరా...? అసలే సర్కస్‌ది అంటున్నావు. ఎలా పోద్దో ఏమో? నీ కసలే కొత్త. దీన్నెందుకు తెచ్చావురా?" అని తండ్రి మందలించాడు అన్వర్‌ను. అయినా అన్వర్ లెక్కచేయలేదు. మరుసటి రోజే బండి కట్టాడు. నలుగురు ప్రయాణీకుల్ని ఎక్కించుకుని, పట్నం రోడ్డు పట్టాడు. ఇదంతా అలవాటు లేని గుర్రం నెమ్మదిగా నడవసాగింది.

పట్నంలో రోడ్డు మీద నెమ్మదిగా వెళ్తుండగా పక్కన వున్న గారడీవాడు డోలు వాయించి జనంచేత చప్పట్లు కొట్టిస్తున్నాడు. అంతే. గుర్రానికి తను రోజూ చేసే పని జ్ఞాపకం వచ్చింది. పూనకం వచ్చినట్లుగా రివ్వున పక్కనున్న మైదానంలో గుండ్రంగా తిరగసాగింది. పగ్గాలు ఎంత గుంజినా ఆగలేదు. మూడు చుట్లు గుండ్రంగా తిరిగి, వెంటనే ముందరి కాళ్లను పైకెత్తి వెనుక కాళ్లమీద నిలుచుంది. ఇంకేముంది! బండిలో ప్రయాణీకులతో పాటు అన్వర్ కూడా కింద పడ్డాడు. తలకు బొప్పి కట్టింది. బండిలో వాళ్లకు కాళ్లు, చేతులు విరిగాయి. ఒక వ్యాపారి గాజు సామానంతా ముక్కలైంది. వాళ్లంతా అన్వర్‌నూ, గుర్రాన్ని తిడుతూ "సర్కస్ గుర్రాన్ని బండికి కట్టి మా ప్రాణాలు తీయాలనుకుంటున్నావా? మాకు జరిగిన నష్టానికి తగిన పరిహారమివ్వు. లేకుంటే నీ మీద కేసు పెడతాం" అని బెదిరించారు. వాళ్లందరిని బతిమాలి మూడు వేలు చేతిలో పెట్టాడు. వెంటనే ఆ సర్కస్ గుర్రాన్ని సంతకు తోలుకెళ్లి ఐదొందల రూపాయల నష్టానికి తిరిగి అమ్మేశాడు. మరో బండిలాగే గుర్రాన్ని అప్పు చేసి మరీ కొన్నాడు. అయినా అన్వర్ బండి ఎక్కడానికి జనం భయపడి వేరే బండి ఎక్కిపోసాగారు. తండ్రి చెప్పిన మాట పెడచెవిన పెట్టినందుకు డబ్బూ, నమ్మకాన్ని పోగొట్టుకుని, బాధపడసాగాడు అన్వర్.





వి'చిత్రం'

పిల్లలూ..
ఇవాళ్టి విచిత్రం చూశారుగా. కేవలం మా చిన్నారులైన మీకోసమే తీసుకొచ్చాం. దీనికి ఓ ప్రత్యేకత వుంది. అవునూ... దాన్ని చూస్తే మీకు ఏమనిపిస్తుందో చెప్పండి. ఒక బుడ్డోడు తన స్నేహితులతో పడవలో వెళ్తున్నాడా? ఓకే ఇంకా ఏం కనిపించడంలేదా? అయితే జవాబు చూడండి.

ఈ బొమ్మకు ఓ ప్రత్యేకత వుందన్నాంకదా. అదేంటంటే... అందులోని ప్రతి వస్తువూ పుస్తకంతో చేసినదే. ఆఖరుకు నీళ్లు కూడా. తెరచిన పుస్తకంలా వున్నాయి కదూ. మరదే ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం.

దారి తెలీడంలేదే!





ఒకేలాంటి నల్లులేవి?

పిడుగులూ...! ఇవాళ మీ ముందుకు ఆరు నల్లులు వచ్చాయి. చూశారుగా. పెద్ద ఎలా ఫోజు పెట్టాయో కదా. ఇవి ఇవాళ మీకు ఓ పందెం పెడుతున్నాయర్రా! అదేంటంటే... ఆ ఆరూ చూడడానికి ఒకేలా వున్నప్పటికీ వాటిలో రెండు మాత్రమే కవల నల్లులు. వాటిని మీరు ఇలా చూసి అలా గుర్తుపట్టాలంట. 'ఓస్ అదెంత?' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ అది చెప్పినంత సులభం కాదర్రా! అయినా మీ మాట ఎందుకు కాదనాలి. తెలీకపోతే మాత్రం పేజీ తిరగేసి చూడండే.

రంగులు అద్దుదాం





హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో మీకు తెలుసా? అయినా ఇంత మంచి క్రికెటర్ తెలియనివారు ఎవరుంటారులే. మరైతే వెంటనే ఆయన పేరేంటో కార్డు మీద రాసి పంపండి. సరైన సమాధానమైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పడే చెయ్యాలని తెలుసుకదా. మా చిరునామా:

వీరి వీరి గుమ్మడిపండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

సరైన సమాధానం రాసినవారు

కె.ఆర్. లోకేష్, 1వతరగతి, కానూరు, విజయవాడ. జి.సాయినాథ్, 6వతరగతి, వెూదుకూరు, గుంటూరు. ఎం.అభిషేక్, 3వతరగతి, ఎం.అవినాష్, 7వతరగతి, కంచారం. పి.జయశ్రీ, 7వతరగతి, చిలకలూరిపేట, గుంటూరు. ఎన్.నుజన్, 3వతరగతి, శ్రీవెంకటేశ్వర బాలకుటీర్. ఎ.రవి, కౌశిక్, 4వతరగతి, హస్తినాపురం, చీరాల. కాలువ శ్రీఅనూహ్య, 6వతరగతి, గుంటూరు. ఎం.సతీష్, 5వతరగతి, నెల్లూరు. పి.పవిత్ర, ఎమ్.వినాయక్, డి. అమూల్య, 9వ తరగతి, బి.వెంకటేష్, సి.బి.చారి, 7వ తరగతి, పి.వెన్నెల, 6వ తరగతి, గుంటూరు.

గతవారపు జవాబు

మోటూరు హనుమంతరావు

చిన్నారి చిత్రకారులు



జి.శివకృష్ణ, 10వ తరగతి, శ్రీ శాంతినికేతన్ స్కూల్, పెనుబల్లి, ఖమ్మం.

ఎస్‌కె. అలీం, 8వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి, ప్రకాశం.



జిల్లెళ్ల కృష్ణ చైతన్య, 8వ తరగతి, శ్రీ శాంతినికేతన్ స్కూల్, పెనుబల్లి, ఖమ్మం.

కొండకు కుండకు తేడా ఏంటి?

నేస్తాలూ.... ఇవాళ మీ తెలివితేటలను పరీక్షించదలిచాం. అందుకు ఒక పేద్ద ప్రశ్న వేద్దామనుకుంటున్నాం. మరి సరైన సమాధానం చెప్తారా? అయితే రెడీగా వుండండే.

కొండకు - కుండకు తేడా ఏంటి? ఏంటి! అలా తెల్లమొహం వేశారు. బాగా ఆలోచించుకుని చెప్పాలి. అర్రే! నేస్తాలూ... కొండ త్రిభుజాకారంలో, కుండ గుండ్రంగా వుంటుందా! మీ సమాధానం ఇదే అయితే తప్పలో కాలేసినట్టే. అసలు జవాబు ఏంటంటే.... ఏంటంటే....

కొండను పగలకొట్టడం కష్టం. కుండను పగలకొడితే నష్టం.

ఆ పదం ఏంటబ్బా!

అదో పదం. అందులో మొత్తం ఐదంటే ఐదే అక్షరాలుంటాయి. దానికి ధర అన్న అర్థం వస్తుంది. మొదటి అక్షరం తీసివేస్తే ఆంధ్రప్రదేశ్‌లో అందరూ ఇష్టంగా తినే ఆహారం వస్తుంది. మొదటి రెండు అక్షరాలు తీసేస్తే హిమాలయాల్లో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుందే అది వస్తుంది. ఇంతకీ ఆ పదం ఏంటి?

జవాబు

Price మొదటి అక్షరం తీసేస్తే rice. మొదటి రెండు అక్షరాలు తీసేస్తే ice. సరిపోయిందా.

కాసా శ్రీకాంత్, 10వతరగతి, కోరుటూరు, నెల్లూరు.

ఇంగ్లండు ప్రేమ - ఇండియా పెళ్లి

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

అర్ధరాత్రి దాటింది.

అయినప్పటికీ ఆ రోజు విశాఖపట్నంలో స్టార్ హోటళ్లన్నీ హడావుడిగా వున్నాయి. డ్యాన్సు ప్రోగ్రాంలు, మ్యూజికల్ నైట్సుతో యువతీ యువకులు ఆనందోత్సాహాలతో ఉన్నారు.

ప్రేమికులరోజుకు స్వాగత సన్నాహాల్లో ఉన్నారు.

ఫిబ్రవరి 14 వాలంటైన్స్ డే పేరుతో ప్రేమికులు కలుసుకునే సాంప్రదాయం బాగా ప్రాచుర్యం పొందింది. ఆ రోజుకు స్వాగతం పలకడానికి ముందురోజు రాత్రే ఎంతోమంది వివిధ హోటళ్లలో కార్యక్రమాలకు హాజరయ్యారు.

ప్రేమికులరోజు ప్రారంభమైన నమయంలో ఒకరినొకరు కలునుకుని మొట్టమొదటిసారి అభినందించుకుంటే వారి ప్రేమ చిరస్థాయిగా నిలుస్తుందని చాలామంది నమ్మకం.

ఆ నమ్మకంతోనే వేడుక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

యువతీ యువకులు నగరవీధుల్లో హడావుడి, గందరగోళం సృష్టించకుండా కమీషనరేట్ పోలీసులు రాత్రిగస్తీ కూడా ఆ రోజు ముమ్మరం చేశారు.

నగరమంతా గందరగోళంగా ఉండగా విశాఖ సముద్రతీరం సమీపంలో ఉన్న పాండురంగస్వామి దేవాలయం ప్రశాంతంగా ఉంది.

దేవాలయం ముందు నాలుగు కార్లు ఆగి ఉన్నాయి.

దేవాలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. దేవాలయ పూజారి నిద్రను బలవంతంగా ఆపుకుంటున్నాడు.

2005 ఫిబ్రవరి 13 అర్ధరాత్రి దాటిపోయింది. ప్రేమికులరోజు ప్రవేశించింది.

దేవాలయంలో ఆశిపు శిరీష పెళ్లి బట్టల్లో మెరిసిపోతోంది. ఆమె చుట్టూ నలుగురు స్నేహితులు ఉన్నారు. తల్లిదండ్రులు డాక్టర్ శిరీష్, డాక్టర్ ఆశిపు శివప్రసాదరావులు కళ్యాణవేదికను ఆనుకుని నిల్చున్నారు. వారిపక్క మరో ముగ్గురు డాక్టర్ దంపతులున్నారు.

పాండురంగస్వామి ఆలయం ముందు కారు ఆగింది.

అందులో నుంచి గారిథ్ మిత్రులు దిగారు.

వారి వెనుక మరో కారు వచ్చింది. అందులో నుంచి గారిథ్ అతని తల్లిదండ్రులు దిగారు.

ఆరు అడుగుల ఎత్తున్న గారిథ్ టక్ చేసుకుని టై కట్టుకుని నిల్చున్నాడు. అక్కడున్న వారు అతడిని దగ్గరికి రమ్మని చెప్పి నుదుటికి తిలకం దిద్దారు. బుగ్గపైన చుక్క పెట్టారు.

దేవాలయం అరుగుపైన ఓ మూలన గుంపుగా కూర్చున్న బాజా భజంత్రీల బృందం, సన్నాయి వాయించే వ్యక్తులు కళ్యాణ రాగాన్ని అందుకున్నారు.

పూజారి పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు మొదలుపెట్టాడు.

వేద మంత్రోచ్చరణలతో కార్యక్రమం మొదలైంది.

తెలుగు సాంప్రదాయం ప్రకారం, హిందూ వివాహవేడుకలతో వివాహం ప్రారంభమైంది. వేద మంత్రాలతో పూజారి కార్యక్రమాన్ని ప్రారంభించాడు. తలంబ్రాలు పోసుకోవడం, బిందెలో ఉంగరం వెతుక్కోవడం, ఏడు అడుగులు నడవడం, అరుంధతి నక్షత్రాన్ని చూడటం, అక్షింతలు జల్లుకోవడం వంటి కార్యక్రమాలన్నీ జరిగాయి.

పెళ్లి దృశ్యం

కేవలం ఇరవై ముప్పయిమంది బంధువులు, స్నేహితుల మధ్య, పాండురంగస్వామి సాక్షిగా ఇంగ్లండు అబ్బాయికి ఆంధ్రా అమ్మాయికి వివాహం జరిగిపోయింది. వచ్చిన వాళ్లందరూ ఆశీర్వాదాలు అందించారు.

ప్రేమికుల రోజు ప్రారంభమైన ప్రాతః కాలంలో వైభవంగా జరిగిన ఈ వివాహం ఆదర్శంగా నిలిచింది. వధూవరులిద్దరూ అబ్బాయి తల్లిదండ్రులకు షేక్ హేండిచ్చి అభినందనలు పొందారు. తర్వాత అమ్మాయి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

డాక్టర్ అరుణ, శివప్రసాద్‌రావులు వారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. పాతికేళ్ల క్రితం తమ ప్రేమ వారి కళ్లముందు మెదిలింది. తల్లిదండ్రులను ఎదిరించడం వారికి గుర్తుకువచ్చింది. ప్రేమికులందరినీ తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే గొడవలకు, ఆత్మహత్యలకు, లేచిపోవడాలకు ఆస్కారమే ఉండదు కదూ అనుకుంది అరుణ మనసులోనే. కూతుర్ని రెక్కలు పట్టుకుని పైకిలేపి గుండెలకు హత్తుకుంది. అప్రయత్నంగా ఆమె కళ్లల్లో గతకాలపు జ్ఞాపకాలు కన్నీళ్లుగా పైకి ఉబికాయి.

తూర్పురేఖలు విచ్చుకుంటున్నాయి.

వివాహ బృందం కార్లు ఎక్కాయి.

విశాఖ బీచ్‌రోడ్ వెంబడి కార్లు వరుసగా కదిలాయి.

* * *

ఇంగ్లాండులో న్యూ కేథల్ అపాన్‌టైన్ సంస్థలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గారిథ్. అదే సంస్థలో సైకాలజిస్టుగా పనిచేస్తున్న ఆశిపు శిరీషతో ప్రేమలో పడ్డాడు. శిరీష విశాఖపట్నానికి చెందిన యువతి. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులు కావడంతో కొంతకాలం క్రితమే ఇంగ్లండు వచ్చి స్థిరపడ్డారు. వారితోపాటు శిరీష చిన్నతనం అంతా ఇంగ్లండులోనే గడిచిపోయింది.

శిరీష సైకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసే సమయంలో ఆమెతో పనిచేసే రేచెల్‌తో మంచి స్నేహంతో ఉండేది. వాళ్లింటికి తరచూ వెళ్లేది. క్రమంగా రేచల్ భర్త పీటర్ కూడా వారి కుటుంబానికి సన్నిహితం అయ్యాడు. శిరీష, రేచెల్ మంచి స్నేహితులు కావడంతో ఒకరింటికి ఒకరు తరచుగా వెళ్లి వచ్చేవారు. ఆ సమయంలో శిరీష మంచితనం అణుకువను గమనించిన పీటర్ తన మిత్రుడు గారిథ్‌కు శిరీషను పరిచయం చేశారు.

వారిద్దరూ ఒకే నంస్థలో వని చేస్తున్నప్పటికీ ఒకరిని ఒకరు చూసుకోకపోవడం, ఒకరి గురించి మరొకరికి తెలియకపోవడం వల్ల ఇద్దరూ విస్మయం చెందారు. వారి పరిచయం క్రమక్రమంగా పెరిగిపోయింది.

ఒకరంటే ఒకరికి ఇష్టం ఏర్పడి, ఆ ఇష్టం ప్రేమగా రూపాంతరం చెందింది. మూడేళ్లపాటు వారి ప్రేమ మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. ప్రేమకు పరాకాష్ట పెళ్లిగా ఇద్దరు భావించారు.

కొద్దిరోజులు ఇద్దరూ తర్జనభర్జనలు పడ్డారు.

"నాకు తెలుగు సాంప్రదాయం అంటే

ఇష్టం. హిందూ వివాహ పద్ధతి అంటే గౌరవం. అందుకే నాకు ఇష్టమైన విశాఖపట్నంలో వివాహం చేసుకుందాం. మా అమ్మానాన్నలను ఒప్పిస్తాను. మీ వాళ్ల సంగతి చూడు!". శిరీష అంది.

గారిథ్ రెండు నిమిషాలు ఆలోచించాడు.

"నువ్వంటే నా కిష్టం. నీ ఇష్టాలన్నీ నా ఇష్టాలుగా మార్చుకుంటాను. నువ్వు నీ వాళ్లను ఒప్పిస్తానని అంటున్నావు. నేను కూడా మా ఇంట్లోవారితో చెప్పి ఒప్పిస్తాను!" నెమ్మదిగా చెప్పాడు.

అనుకున్న విధంగా గారిథ్ తన తల్లి దండ్రులతో ఈ పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. ఈ ప్రతిపాదన వారికి ఆశ్చర్యం కలిగించింది. హిందూ సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకోవడం, అదీ ఎక్కడో దూరంగా ఉన్న విశాఖపట్నంలో నిర్ణయించడం ఎందుకో వారు ఇష్టపడలేకపోయారు.

అయినప్పటికీ గారిథ్ ప్రతిపాదనను వారు తిరస్కరించలేదు.

బంధుమిత్రులతో విశాఖపట్నం వెళ్లడానికి అంగీకరించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

శిరీష తండ్రి డా॥శివప్రసాదరావు చొరవ తీసుకుని విశాఖపట్నంలో పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అక్కడ తన మిత్రులకు ఈ విషయాన్ని చెప్పి ఏర్పాట్లు చేయమని పురమాయించారు.

విశాఖపట్నంలో ప్రొఫెసర్ అరుంధతి ఈ కార్య క్రమాన్ని నిర్వహించడానికి నిర్ణయించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహ ఏర్పాట్లు జరిగాయి. ముహూర్తాలు... మంచిరోజు అని చూడకుండా ప్రేమికుల దినోత్సవాన్నే పెళ్లిరోజుగా నిర్ణయించుకున్నారు.

'2005 ఫిబ్రవరి 14 తేది వివాహం'

ఈ విషయాన్ని విశాఖపట్నంలో మిత్రులకు సమాచారం అందించారు. ఇంగ్లండు నుంచి గారిథ్ తండ్రి మైఖేల్ తన మిత్రులందరికీ తెలియజేశాడు. శిరీష తల్లిదండ్రులు తమ మిత్రులకు తెలియజేశారు.

ఇరుకుటుంబాలకు చెందినవారు ఇరవైమందిలోపే...

అందరికీ విమాన టిక్కెట్లు సిద్ధమయ్యాయి.

వారి ఆతిథ్యంకోసం విశాఖపట్నంలో స్టార్ హోటల్‌లో గదులను బుక్ చేశారు.

పెళ్లికి రెండురోజుల ముందు చేరేలా ఇరుకుటుంబాల వారు తమ ఏర్పాట్లు చేసుకున్నారు.

* * *

ఫిబ్రవరి 16, విశాఖపట్నం.

ఎయిర్‌పోర్టులో హడావుడిగా ఉంది.

శిరీషా, గారిథ్ దంపతులు తమ తల్లిదండ్రులతో కలసి ఇంగ్లండు వెళిపోవడానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

"భారతదేశం ఎంతో పవిత్రదేశం. ఇక్కడ ప్రేమికులు, పెళ్లి చేసుకున్న దంపతులు చూడవలసిన అద్భుత దృశ్యాలు ఎన్నో ఉన్నాయి. ప్రేమకు ప్రతిరూపంగా ఉన్న తాజ్‌మహల్ చూడకుండా వెళ్లకూడదు!" విశాఖపట్నంలో ప్రొఫెసర్ రామనాథం గారిథ్‌తో చెప్పాడు.

గారిథ్ ఒక్క క్షణం ఆలోచనల్లో పడ్డాడు.

పెళ్లి అయిన వెంటనే ఇంగ్లండు వెళ్ళిపోవడం అతనికీ నచ్చలేదు. పెళ్లి తర్వాత హనీమూన్ భారతదేశంలో మంచి ప్రాంతాలను చూస్తూ ఎందుకు గడపకూడదు. ఎలాగూ మరో పదిరోజులు సెలవులు ఉన్నాయి. ఇప్పుడే అందరితో కలిసి ఇంగ్లండు వెళ్లి చేసేది ఏముంది... అతనిలో ఆలోచనల పరంపర. శిరీషను పక్కకు తీసుకువెళ్లి తన ఆలోచన చెప్పాడు.

ఆమె కూడా అదే ఆలోచనతో ఉంది.

క్షణాల్లో నిర్ణయాలు మారిపోయాయి.

శిరీషా గారిథ్‌లు బొంబాయి వరకు మాత్రమే వచ్చి అక్కడ ఉండిపోతారు. మిగిలినవారు ఇంగ్లండు వెళిపోతారు. నాలుగురోజులు భారత్‌ను చూసి తిరిగి వారు ఇంగ్లండు వెళతారు.

ఈ మేరకు టిక్కెట్లు రద్దు... సూట్‌కేసుల మార్పిడి మొదలైనవన్నీ చకచకా జరిగిపోయాయి.



శిరీష తల్లిదండ్రులతో దంపతులు

శిరీష తల్లి డా॥ అరుణ ఈ విషయాలన్నీ మౌనంగా గమనిస్తోంది. ఆమెకు కూతురు అల్లుడు హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం ఒకలాంటి విస్మయాన్ని కలిగించింది. తమకు వారు కలిసి రావడం లేదన్న విషయం అంత తొందరగా జీర్ణించుకోలేకపోయింది.

అయినప్పటికీ పైకి ఏమీ అనలేదు.

ఎయిర్‌పోర్టు లాంజ్‌లో డాక్టర్ అరుణ పక్కన డెబ్భైసంవత్సరాల వృద్ధురాలు కూర్చుంది. ఆమె పేరు రాజ్యలక్ష్మి. ముంబాయిలో ఉన్న కొడుకు వద్దకు వెళ్లడానికి ఎయిర్‌పోర్టుకి వచ్చింది.

రాజ్యలక్ష్మి ఎయిర్‌పోర్టులో జరుగుతున్న తతంగాన్ని అంతా గమనిస్తోంది. గారిథ్, శిరీషా అందరి వద్దా వీడ్కోలు తీసుకోవడాన్ని కూడా చూసింది.

డాక్టర్ అరుణ పక్కకి వచ్చి కూర్చుని "మీ అల్లుడా?" అని అడిగింది.

అంతవరకూ ఆలోచనల్లో ఉన్న అరుణ ఉలిక్కి పడింది. గబుక్కున ఊహల్లోంచి బైటికి వచ్చింది.

"అవును. కొత్తగా పెళ్లి అయింది. వాళ్లని ఇండియాలో వదిలిపెట్టి మేం మాత్రం ఇంగ్లండు వెళుతున్నాం!"

"ప్రేమించుకున్న తర్వాత పెళ్లి అనుకుంటా... అందుకే అంత ఆత్మీయంగా ఉన్నారు. ఈ ప్రేమ వివాహం మీకు సమ్మతమేనా?" రాజ్యలక్ష్మి మాటలు కలిపింది.

అరుణ ఏమీ మాట్లాడలేదు.

"మాదీ ప్రేమ వివాహమే. ముప్పై సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లా ఆత్మకూరునుంచి వచ్చి ఆంధ్రా యూనివర్సిటీ బయోకెమిస్ట్రీలో చదివాను. విజయనగరానికి చెందిన శివప్రసాద్‌రావు కూడా నాతో చేరారు. మా ఇద్దరి అభిప్రాయాలు కలిశాయి. అభిరుచులు కలిసాయి. చదువు అయ్యేంతవరకూ ప్రేమించుకున్నాం. చదువు తర్వాత కలిసి జీవించాలని అనుకున్నాం. మా పెద్దలు అంగీకరించలేదు. ఇరుపక్షాల వారినీ ఒప్పించడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. ఆ సమయంలో సాంప్రదాయాలు, కట్టుబాట్లు ఎక్కువగా ఉండేవి. అయినప్పటికీ మేమిద్దరం ఆదర్శ వివాహం చేసుకున్నాం!" డాక్టర్ అరుణ చెప్పడం మొదలుపెట్టింది.

ఆమె మాటలు రాజ్యలక్ష్మి ఆశ్చర్యంతో వింది.

వయసు తెచ్చిన పెద్దరికం ఆమెలో ఒకలాంటి హుందాతనాన్ని తెచ్చి పెట్టింది. "మీ ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గాబట్టి మీ అమ్మాయి ప్రేమ వివాహాన్ని కూడా అంగీకరించి జరిపించారనుకుంటాను. మీ పెళ్లి సమయంలో మీకు ఎదురైన ఇబ్బందులు వీరికి ఎదురుకాకుండా వారిని ఏకం చేయడంలో మీరు చాలా అభినందనీయం" రాజ్యలక్ష్మి చెప్పింది.

ఇంతలో డాక్టర్ శివప్రసాద్‌రావు అటువైపు వచ్చి భార్యను, భార్యతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మిని చూసి "ఫ్లైట్‌కు టైం అయిపోయింది. ఎనౌన్స్‌మెంటు కూడా ఇచ్చేశారు" అన్నాడు.

"బాబూ! ఈ ప్రపంచంలో ప్రేమకన్నా గొప్పతనమైనది ఏదీ లేదంటారు. మీ ఆలోచన... మీ అమ్మాయి పట్ల మీ దంపతుల దృక్పథం ఎంతో ఆదర్శనీయంగా ఉంది. ఈ పెళ్లిని ఎవరైనా అభినందించారో లేదో నాకు తెలియదు. కానీ నేను మనస్ఫూర్తిగా ఆ దంపతుల్ని ఆశీర్వదిస్తున్నాను. మిమ్మల్ని అభినందిస్తున్నాను!" అంది.

తర్వాత ఎయిర్‌పోర్టు లాంజ్‌లోంచి భారంగా కదిలింది. ఆమె వెనుక డాక్టర్ అరుణ, డాక్టర్ శివప్రసాద రావ్‌లు ఇతర బంధువర్గం అనుసరించారు. ★

టీవీ స్ట్రోక్...!!

పి. జ్యోతి

మొన్నామధ్య ఓసారి ఏం జరిగిందంటేనండీ...

మా 'బాలు' గాడున్నాడు చూడండి. నిండా ఏడేళ్ళుకూడా లేవండీ వాడికీ...

చాలా యాక్టీవ్‌గా ఉంటాడన్నింట్లోనూ. అటు స్కూల్లోనూ... ఇటు ఇంట్లోనూ... అందరూ తెగమెచ్చుకునే వాళ్ళేనండీ...

ఇంతకూ చెప్పొచ్చేదేవిటంటే... ఎందుకనో ఉన్నట్టుండీ బాలూగాడు ముభావంగా మారిపోయాడు. తిండిసరిగా తినడ... ఒక్క మాటకీ సరియైన సమాధానం లేదు. ఉలుకూ లేదు పలుకూలేదు.

నాకు తెగ కంగారు పుట్టిందండీ. మా అత్తవారికి వాడంటే



పల్లమాలిన ప్రేమ. వాడిక్కూడానూ...

నేనూ మావారూ పొద్దున్నే హడావిడిగా జాబ్‌కు వెళ్ళిపోతే, ఆవిడే అన్నీ దగ్గరుండి చూస్తారులేండి... అందుకనీ నానమ్మకే మరింత చేరువయ్యాడు వాడు. కానీ ఆమెకూడా వాణ్ణి ఎంతగా బ్రతిమాలినా, బామాలినా కూడా కారణం చెప్పలేదు.

వాడిస్కూల్లో ఏదైనా ప్రాబ్లెమ్ వచ్చిందో ఏమోననీ అందరినీ ఎంక్వయిరీ చేశాను... ఏవీ జరగలేదని తెలిసింది.

ఇక ఉపేక్షించి లాభంలేదని నా క్లోజ్‌ఫ్రెండ్ సైక్రియాట్రిస్ట్ డా. మాలతి దగ్గరకు బాలును తీసుకుని వెళ్ళానండి. అది బాబును రూమ్‌లోకి తీసుకెళ్ళి మొత్తానికి ఏవో టెస్టులు చేసి అసలు విషయాన్ని తెలుసుకుంది. అది బయటకు వచ్చీ రాగానే నావంక సూటిగా చూస్తూ...

"ఒసేవ్ నిమ్మీ! నువ్వు రోజూ 'ఫో టీ.వీ' ఛానల్‌లో వచ్చే సీరియల్స్ చూస్తావా" అనడిగిందండీ యమా సీరియస్‌గా... ఆ టైంలో ఆ విషయం ఎందుకడిగిందో అర్థంకాక దానివంక అయోమయంగా చూస్తూ...

"అవునూ... నేనూ, బాలూగాడూ కలిసి రోజూ 7 గంటలకు వచ్చే "మూసిన తలుపులు" సీరియల్‌ను ఇంట్రెస్ట్‌గా చూస్తూ ఉంటాం" అన్నానండి... అంతే.

అది వెంటనే "మరదే అందుకే బాలూకు 'టీ.ఫీ స్ట్రోక్' అనే జబ్బు పట్టుకుంది" అంది

"అదేవిటీ హార్ట్‌స్ట్రోక్‌లా టీ.వీ స్ట్రోక్ ఏవిటే" భయంగా అడిగానండి.

"ఇందాక బాలూను లోపలకి తీసుకెళ్ళి అడిగితే వాడు నాతో చెప్పిందేవిటో విను" అంటూ వాడన్న మాటలు క్యాసెట్ చేసిమరీ విన్పించింది. అదేవిటంటే...

"ఆంటీ! బాబీ గాడి నానమ్మలా మా నానమ్మ ఎందుకు లేదూ"?

"బాబీగాడు ఎవరూ"? విస్మయం గా అంది మాలతి గొంతు.

"అయ్యో మీకు తెలీదా ఆంటీ... ఓ... నాకయితే ఎప్పటి నుంచో తెలుసూ... వాడికి వాడి నానమ్మ దర్జాగా ఉందనేగా అంతపొగరూ, మా నానమ్మ కూడా అలా ఉంటే వాడి అంతు తేల్చేవాడిని" అన్నాడు.

"ఇంతకూ వాడెవడ్రా"

"అదే ఆంటీ రోజూ రాత్రి పూట 'ఫో టీ.వీ' ఛానల్‌లో వస్తుందే "మూసిన తలుపులు" సీరియల్. దాన్లో ఉన్నాడులేండి... వాడి నానమ్మ ఉంటుందీ... ఒక్క టీత్‌కూడా ఊల్లా. ఒక్క హెయిర్ కూడా వైట్‌కాలా. అబ్బో సారీస్ కడుతుందీ పేద్ద బార్డర్‌వే... మెళ్ళో ఈన్ని నగలు... కుళ్ళుమోతుది... కోడల్ని తిడుతూంటుందీ... అలాంటావిడ్ని చూసుకునీ వాడికింత పొగరు... పాపం మా నానమ్మ అలాలేదు ఆంటీ... టీత్ ఊడిపోయి, హెయిర్ వైట్ అయిపోయి, ఎప్పుడూ మామూలివే సారీస్ కడుతుంది. అప్పుడు నేనన్నా... మా అమ్మన్నా ఎంతప్రేమో, నానమ్మ అన్నా అంత ప్రేమ అన్నా. మా నానమ్మ కూడా టీ.వీలో నానమ్మలా దర్జాగా రీవిగా ఉంటేనా... ఆ బాబీగాడి అంతు తేల్చేవాడిని. ఓ రోజు చాలా కోపంవచ్చీ... వాణ్ణి టీ.వీ మీదే తన్నా. మరి వాడెక్కడుంటాడో తెలీదుగా... అందుకే టీవి మీద తన్నా. ఈ మధ్య నాకు ఇదే ఆలోచన. హోంవర్క్ చేయబుద్ధి కావట్లేదు...ఏ ఆటా ఆడబుద్ది కావట్లేదు ఆంటీ" వాడి గొంతులో ఎంత ఆవేశం? క్యాసెట్ ఆపేసింది మాలతి.

"ఏవిటి మాలతీ వాడు ఇంత మనసులో పెట్టుకున్నాడా? మరినాతో ఎప్పుడూ అన్లా" అన్నా ఆశ్చర్యపోతూ.

"నిమ్మీ! ఇహనువ్వు ఆ వెర్రిమొర్రి సీరియల్స్ వాడితో కలిసి చూడకే బాబూ. ఈ పసివయసులోనే అలాంటి టీ.వీ సీరియల్స్‌కు బలిచేయకే. నేనెలానో వాడికి ట్రీట్‌మెంట్ ఇచ్చి మళ్ళీ మామూలు వాణ్ణి చేస్తా, కానీ నువ్వు ఆ సీరియల్స్ జోలికి పోనని నాకు మాటివ్వు" అని బాలుమీద ఒట్టేయించి మరీ నన్నొప్పించిందండీ.

"నిమ్మీ! నువ్వు మాత్రం ఎందుకే ఆ వెధవ సీరియల్స్ చూసి టైంవేస్ట్ చేసుకుంటావ్. నీకో విషయం చెప్పాలే. మొన్నోరోజు మా తమ్ముడు అమెరికా నుండి ఫోన్ చేశాడే. అప్పుడే ఆ సీరియల్ పెద్దసౌండ్‌పెట్టి మా అత్తవారు చూస్తోంది. అది వాడికక్కడికి ఫోన్‌లో వినబడీ "ఏవిటే అక్కా ఏం సీరియల్" అనడిగాడు. అదే "మొన్నే పెళ్ళాడేసా" సీరియల్ వెయ్యోనొక్కో భాగం అన్నాను.

వాడు "అక్కా! అదీ నేనిండియాలో ఉండగా వచ్చేది... ఆ సీరియల్లేనా" అనడిగాడే.

"అవున్రా తమ్ముడూ! అందులో హీరో ఆరుగుర్ని పెళ్ళి చేసుకుని, వాళ్ళు సుబ్బరంగా ఉండగానే ఏడోపెళ్ళి చేసుకోబోతున్నాడు... నేను చూడట్లేదురా, మా అత్తగారు చూస్తున్నారు" అని చెప్పా.

మా మాలతి ఏం మాత్రలు వేసిందో కానీ ఇంటికి రాగానే మా బాలుగాడూ మా అత్తవారి దగ్గరికెళ్ళి "నానమ్మా నాకు ఆ టీ. (రీ)వీ నానమ్మ వద్దూ... బాగోలా.... ఇహనుంచి చూన్నే చూన్ను నువ్వు చెప్పే అనగనగా... కథలు వింటా" అనంటూ ఆమె ఒళ్ళో గారాలుపోయాడులేండి.

☆



వీసా గోస

రుక్మిణి

అవమానం... ఘోరఅవమానం... నమస్త హిందూజాతికే అవమానం... ఒక గొప్ప ప్రజాస్వామిక దేశం ఇంతటి నీచమైన నిర్ణయం తీసుకోవడం... నాగరిక ప్రపంచ ప్రజలందరికీ అవమానం... నాగరికతకే పరాభవం... హో...

అద్వానంగారు గుండెలు బాదుకుంటున్నాడు. ఎలా బాదుకుంటున్నానో అని తనకుతానే నిలువుటద్దంలో చూసుకుంటూ బాదుకుంటున్నాడు. ఆ సీను మీడియాలో ఎంతగా పండుద్దాని తనకుతానే రిహార్సల్ చేసుకుంటున్నాడు. ఆపసోపాలు పడుతున్నాడు. కిందామీదా కూడా పడుతున్నాడు. అది చూసి నిలువటద్దమే కంగారుపడిపోతోంది. అద్వాన్నంగారి ప్రతిబింబం ఊరుకుంటుందా మరి!

"అరె... ఏంటిసార్... ఏమయింది...."

బింబం విభ్రాంతిగానే అడిగింది.

"మూర్ఖుడా... అమెరికా ఈజ్ ఎ రోగ్ కంట్రీ... థూ... దానికి ప్రజాస్వామ్య స్ఫూర్తిలేదు... విలువలు తెలియవు... దుష్టరాజ్యం..." రొప్పుతూ అన్నాడు.

"అదేంటిసార్... ఇంతకీ ఏం జరిగింది?" మళ్ళీ రెట్టించ్చింది అద్దంలో బింబం.

"మనదేశంలోని ఒక రాష్ట్రముఖ్యమంత్రికి అది అన్ని రకాల వీసాలను నిరాకరించింది. చివరికి టూరిస్ట వీసాకూడా ఇవ్వనంది. ఎంతవమానమెంతవమానమెంతవమానం..." ఎంతన్నది ఇంకాఇంకా పొడిగించలేక తెగ ఆయాసం అడ్డొచ్చింది.

"ఓస్... అంతేనా? మోడీగారిని మన దేశంలోనే చాలా రాష్ట్రాల్లోకి రావద్దని దబాయించి వెనక్కి పంపారుగదా!" బింబాద్వాన్నం అనబోతుండగా...

"దరిద్రుడా" పండ్లు పటపట కొరికాడు. అరెరె తన ప్రతిరూపాన్ని తానే తిట్టుకోవడమేంటాని... తర్వాత శాంతించారు. "మోడీగారు గొప్ప రాజనీతిజ్ఞుడు... రాజధర్మం పాటించిన మేధావి. పరిపాలనాదక్షుడు..."

"బాగుందిసార్... ఇవాళ మీకు అమెరికా అతి అనాగరికమైనదిగా కనిపిస్తుంది. మరి అది ఇరాక్ మీద బాంబుల వర్షం కురిపించినపుడూ... అఫ్ఘనిస్థాన్‌ను నేలమట్టం చేసినపుడూ నోరు విప్పలేదు. పైగా అమెరికాకు వత్తాసుగా ఇరాక్‌లోకి సైన్యాన్ని కూడా పంపిస్తామని హామీ ఇచ్చిన సంగతిని మరచినట్లున్నారు. ఇపుడిట్లా మాట్లాడి ఏం ప్రయోజనం... మాటలకు ఓట్లు రాలే సీజనుకూడా కాదే... మరెందుకా ఆయాసం..."

తన బింబమే తనకు బుద్ధిచెబుతున్నట్లుగా తోచి మొహం మీది చెమట్లను ఆదరాబాదరాగా తుడుచుకున్నాడు.

"గోధ్రా తదనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిపిన హేయమైన హత్యాకాండను, నరమేధాన్ని ప్రపంచమంతా గగ్గోలు పెట్టి నిరసించింది. కనీసం దోషులను గుర్తించి విచారణ చేయడానికూడా సిద్ధపడలేదు..."

"సర్సరే...అదంతా ఇప్పుడు గుర్తుచేయడం దేనిగ్గానీ... 'ప్రజాస్వామ్యం' అంటే ఏంటి?" హఠాత్తుగా అద్వానంగారు తేరుకుని గుబీ గుబీమని బల్లగుద్దుతూ మరీ తనకుతాను చెప్పుకుంటున్నట్లో, తన బింబానికి చెప్పే పేరిటో మీడియా ముందు చెప్పే విధంబునకు రిహార్సలింగో గానీ వారి తంటాలకు... అద్దంలో బింబం జాలిగా చూసింది.

"ప్రజలు మెజార్టీతో గెలిపించిన వ్యవస్థేగదా ప్రజాస్వామ్య మంటే. మరి అదే గుజరాత్‌లో తిరిగి మోడీ గారినే ప్రజలు ఎన్నుకుని మళ్ళీ ముఖ్యమంత్రిని చేశారుగదా... ఇక వారు 'దోషి' ఎట్లా అవుతారు?" ముసి ముసిగా నవ్వుకుంటూ ఇలా చెబితే నమ్మరా అన్నట్టు అద్దంలో తన బింబం వంక బహుకొంటెగా కన్నుగీటారు కూడా.

"ఆ మాటకొస్తే ప్రజాస్వామ్యమంటే 'గోధ్రా' తదనంతరం సంఘ్ పరివార్ చేపట్టిన దారుణ సంఘటనలే సార్, మైనారిటీలను తరిమి, తరిమి మంటల్లోకి నెట్టారే... కత్తుల్తో పొట్టలు కోశారే... అదే..కానీ అప్పటి ప్రధాని భారతదేశానికి ఇది ఒక మచ్చ వామ్మో... అని మొసలి కన్నీరు కారుస్తూ "ఇతర దేశాలవారికి నా మొహం ఎట్లా చూపించాలి... బాబోయ్... (కాషాయ తువాలులో మొహం కప్పుకున్నాడు) హమ్మో... పరువుపోతుంది. (గుండెలు బాదుకొనును)" అని అంగలార్చిన వాజ్‌పేయిజీ మోడీగారి మీద అస్సలు చర్యతీసుకోలేదు సరిగదా... 'శభాష్' అని భుజం కూడా తట్టారు! అదీ ప్రజాస్వామ్యం... అంతేకాదు... లండన్‌లో ఉపప్రధాని "గుజరాత్ ఘటనలు దారుణం - సమర్థించుకోరానివి" అని ప్రకటించి - ఇండియాలో మాత్రం నోరు గట్టిగా బిగదీసుకోవడం... మూతి కుట్టేసుకోవడం కూడా ప్రజాస్వామ్యమే! తిరిగి ఎన్నికలు వచ్చే ముందు 'ఈ సంఘటనల్ని ప్రచారం చేయవద్దని సెలవిచ్చారే... "అదీ ప్రజాస్వామ్యమంటే..."

నకలు వేసిన దెబ్బకు అసలుఅద్వానంగారు హడలిపోయి మిడిగుడ్లేసుకుని మిటుకూ, మిటుకూ చూస్తుండి పోయారు. రామ...రామ... ఇదంతా నా మనస్సులో ఏదో మూల లేకపోతే నా బింబంగాడెట్లా మాట్లాడుతాడబ్బా అన్న అనుమానమూ రాకపోలేదు.

"అమెరికా వీసాను ఒక ఆటవిక ముఖ్యమంత్రికి రద్దు చేయడం ఒక రకమైన ప్రజాస్వామ్యం... బ్రిటన్‌వారూ అవునవును మేమూ రక్షణ కల్పించలేం అనడమొక ప్రజాస్వామ్యం. న్యూరెంబర్గ్ ట్రయల్స్ వలె, మోడీగారి రాజధర్మ హత్యాకాండకు కారకులైన ప్రతి ఒక్కరినీ విచారించాలని అమెరికా గట్టిగా వాదించింది. అది ఒక రకమైన ప్రజాస్వామ్యం. అపుడే అఫ్ఘనిస్థాన్, ఇరాక్‌ల మీద నిర్దాక్షిణ్యంగా బాంబుల వర్షం కురిపించిన అమెరికాది అదో రకమైన ప్రజాస్వామ్యం-బిజెపి ఆ సమయంలో గుడ్డిగా అమెరికాకు వత్తాసు పలకడం మరో అద్భుతమైన ప్రజాస్వామ్యం"

దబ్బున శబ్దమైంది. అద్వానంగారు 'దఢీ'మని కుర్చీ మీదినుండి కిందపడి, మూలుగుతూ నడుం పట్టుకుని లేస్తున్నారు.

"బెస్ట్‌బేకరీ కేసు... బిల్కిస్ కేసులను గుజరాత్‌కు వెలుపల విచారణకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినపుడే మోడీ గారికి ప్రపంచవ్యాపితంగానే వీసా నిరాకరించబడింది..."

బింబం వికవికా నవ్వుతోంది... అద్వానంగారు మళ్ళీ దబ్బున నేల మీదపడే ప్రయత్నంలో వున్నారు. ★

మెటబాలిక్ సిండ్రోమ్
తీసుకోవలసిన జాగ్రత్తలు

దక్షణాసియా దేశాలలో ఈ మధ్య కాలంలో గుండెకు సంబంధించిన వ్యాధులలో కొత్తగా వినబడుతున్న అంశం - మెటబాలిక్ సిండ్రోమ్. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వివిధ అధ్యయనాలనూ నిర్వహించడం జరిగింది. ఆ పరిశోధనలు, అధ్యయనాలలో తేలిన మెటబాలిక్ సిండ్రోమ్ ముఖ్య అంశాలే ఈ వ్యాసం.

మెటబాలిక్ సిండ్రోమ్ స్వభావాలు

❖ శరీరంలో ముఖ్యంగా ఉదర భాగంలో క్రొవ్వు చేరడం.

❖ రక్తంలో వివిధ రకాల క్రొవ్వు పదార్థాల శాతం పెరిగిపోవడం. ముఖ్యంగా ట్రైగ్లిసరైట్స్ శాతం పెరుగుతుంది. హెచ్.డి.ఎల్. కొలెస్ట్రాల్ శాతం తగ్గుతుంది.

❖ రక్తపోటు (హైపర్ టెన్షన్) పెరగడం.

❖ శరీరంలో ఇన్సులిన్‌కు రెసిస్టెన్స్ పెరగడం. అంటే శరీరంలో ఇన్సులిన్ పని తీరులో అసాధారణతలు చోటు చేసుకోవడం. ఫలితంగా రక్తంలో సుగర్ శాతం పెరిగిపోతుంది. తర్వాత అది సుగర్ వ్యాధిగా రూపాంతరం చెంది బయట పడుతుంది.

❖ శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించి వ్యాధులకు దారితీస్తాయి. ఇన్‌ఫెక్షన్‌లు పరోక్షంగా



గుండెపోటుకు, పక్షవాతానికి దారి తీయవచ్చును.

❖ రక్తం గడ్డ కట్టడంలో అసాధారణతలు చోటుచేసుకుంటాయి.

❖ మెటబాలిక్ సిండ్రోమ్ వంశపారం పర్యంగా రావచ్చును. కార్టిబోన్స్ వంటి స్టెరాయిడ్‌లు, మానసిక వ్యాధులకు వాడే యాంటీ డిప్రెజెంట్స్, అలర్జీలకు వాడే మందులు, దీర్ఘకాలంగా మందులు వాడే వారిలోనూ ఈ సిండ్రోమ్ రావచ్చును.

❖ సక్రమమైన ఆహారపు అలవాట్లు లేని వాళ్ళలోనూ... తగిన వ్యాయామం లేని వారిలోనూ మెటబాలిక్ సిండ్రోమ్ రావచ్చును.

మెటబాలిక్ సిండ్రోమ్ నిరోధక మార్గాలు

వయస్సుకు మించిన బరువు పెరగకుండా నిరోధించాలి. అంటే స్థూలకాయాన్ని నిరోధించుకోవాలి.

వైద్యుని సలహా పొంది క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలి.

ఆహారంలో కొవ్వు పదార్థాలను తగ్గించాలి. ఉదరంలో కొవ్వు పదార్థాలు (ఫ్యాట్స్) చేరకుండా జాగ్రత్త పడాలి. ఉదర సంబంధ వ్యాయామం చేయాలి.

విపరీతమైన డైటింగ్ వల్ల ఎటువంటి ఫలితం ఉండదు. శాశ్వత ప్రాతిపదికపై బరువు తగ్గేట్లు చూసుకోవాలి. 6 నెలల నుంచి 12నెలల లోపు బరువు తగ్గేందుకు ప్రణాళికను రూపొందించుకొని అమలుపరచాలి.

వ్యాయామం - సలహాలు

ప్రతిరోజూ క్రమం తప్పకుండా అర్థగంట నుంచి ఒక గంట వరకు నడక

(వాకింగ్)ను అలవాటు చేసుకోవడం మంచిది. మెటబాలిక్ సిండ్రోమ్ నిరోధంలో నడక కీలకపాత్ర పోషిస్తోంది. ఇంటిలోనే వ్యాయామం చేసే లేదా నడిచే అవకాశంగల ట్రెడ్‌మిల్ ఇటీవలి కాలంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

మెటబాలిక్ సిండ్రోమ్ ఆహారపు సూచనలు

✪ ఆహారంలో క్రొవ్వు పదార్థాలను చాలా వరకు, అవసరాన్ని బట్టి పూర్తిగా మానివేయాలి. నెయ్యి, జున్ను, వెన్న, మాంసాహారం వంటివి ఆహారంలో పూర్తిగా తగ్గించాలి.

✪ ఫాస్ట్‌ఫుడ్స్ జోలికి వెళ్ళకుండా ఉండడం మంచిది. నూనె వస్తువులు తగ్గించాలి.

✪ చక్కెర, స్వీట్స్ బాగా తగ్గించాలి.

✪ తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

✪ ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.



మెటబాలిక్ సిండ్రోమ్ నిర్ధారణ పరీక్షలు

❄ శరీర బరువును చూసుకుంటూ ఉండాలి.

❄ ఉదరంలో ఉండే క్రొవ్వును పరిశీలిస్తుండాలి. దానిని తెలుసుకునేందుకు నడుము చుట్టు కొలతను టేపుతో కొలవాలి. ఇది మగవారిలో 102 సెం.మీ., ఆడవారిలో 88 సెం.మీ. మించి వుండకూడదు.

❄ కనీసం ఆరు నెలలకు ఒకసారి అయినా రక్తంలోని వివిధ రకాల కొవ్వు పదార్థాల శాతం (లిపిడ్ ప్రొఫైల్)ను పరీక్షించుకోవాలి.

❄ రక్తంలో సుగర్ శాతాన్ని పరీక్షించుకోవాలి.

❄ రక్తపోటును తరచూ పరీక్షించుకుంటూ ఉండాలి. ఏ వయస్సు వారిలో అయినా రక్తపోటు 130/80కి మించి ఉండకూడదు.

డెంటల్ కేర్ క్విజ్-2

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1) చిన్నపిల్లల్లో, పాలపన్ను చిగురును చీల్చుకుని వచ్చేటప్పుడు, జ్వరం, విరేచనాలు వంటి సమస్యలు రావటానికి గల కారణం.
   అ) పాలు అరగకపోవడం
   ఆ) తల్లికి జ్వరం వుండడం
   ఇ) అపరిశుభ్రమైన వస్తువులను, పదార్థాలను కొరకడం
   ఈ) పైన చెప్పిన కారణాలు ఏవీకాదు.

2) పళ్ళు (పాల) రాకపోవడాన్ని
   అ) అనోడాన్షియా అంటారు
   ఆ) పార్షియల్ అనోడాన్షియా
   ఇ) డెంచ్యులస్ అంటారు
   ఈ) ఈడెంచ్యులస్ అంటారు

3) 'పాలపళ్ళు' రావని నిర్ధారించుకోవడం ఎలా?
   అ) సంవత్సరం వయస్సు దాటినా పళ్ళు రాకుంటే
   ఆ) ఎక్స్-రే, ల ద్వారా
   ఇ) దంతవైద్య పరీక్షల ద్వారా
   ఈ) పైన చెప్పినవన్నీ

4) చిన్న పిల్లల దవడల్లో 'పాలపళ్ళ రాకడ' పూర్తయ్యే వయస్సు
   అ) రెండు సంవత్సరాలు
   ఆ) ఒకటిన్నర సంవత్సరాలు
   ఇ) రెండున్నర సంవత్సరాలు
   ఈ) మూడు సంవత్సరాలు

5) పాలపన్ను సాధారణంగా మొదట
   అ) పై- దవడలో వస్తుంది
   ఆ) కింది దవడలో వస్తుంది
   ఇ) రెండు దవడల్లోనూ ఒకేసారీ వస్తుంది
   ఈ) కొంత మందిలో పై దవడలు, కొంతమందిలో క్రింది దవడలో వస్తుంది.

6) పాలపన్ను రాలిపోయిన తర్వాత, పన్ను (స్థిరదంతం) రావడం ఆలస్యం కావడాన్ని ఇలా పిలుస్తారు.
   అ) లేట్ యిరప్షన్
   ఆ) డిలేడ్ యిరప్షన్
   ఇ) మిస్డ్ యిరప్షన్
   ఈ) నాన్ యిరప్షన్

7) సాధారణంగా దవడలో మొదట వచ్చే పన్ను
   అ) మధ్య కొరుకుడు పన్ను (సెంట్రల్ యిన్సిజార్)
   ఆ) ప్రక్కకొరుకుడు పన్ను (లేట్రల్ యిన్సిజార్)
   ఇ) చీల్చే పన్ను (కెనైన్)
   ఈ) విసురుడు పన్ను (మోలార్)

8) 'పాలపళ్ళు' తాత్కాలికమైనవి కనుక వాటి సంరక్షణ
   అ) అవసరం ఉంది
   ఆ) అవసరం లేదు
   ఇ) అంత జాగ్రత్త పనికి రాదు
   ఈ) పైమూడు కరెక్ట్‌కాదు

9) పాలపళ్ళల్లో
   అ) పిప్పిపన్ను వ్యాధి రాదు
   ఆ) పిప్పి పన్ను వ్యాధి రావచ్చు
   ఇ) పిప్పిపన్ను వ్యాధి వస్తుంది
   ఈ) ఏమీ చెప్పలేము

10) దవడల్లో 'పాలపళ్ళు' 'స్థిరదంతాలు' కలిసి వుండటాన్ని
   అ) కలగూరగంప దంతాలు అంటారు.
   ఆ) మిశ్రమ దంతాలు అంటారు.
   ఇ) కలగలుపు దంతాలు అంటారు.
   ఈ) పై మూడు విధాలుగా కూడా పిలుస్తారు.

జవాబులు:

1) ఇ 2) అ 3) ఈ 4) అ 5) అ 6) ఆ 7) అ 8) అ 9) ఇ 10) అ

పుస్తక పరిచయం

తెలుగు సాహిత్య చరిత్ర

తెలుగు సాహిత్య చరిత్ర
-ముదిగంటి సుజాతారెడ్డి
వెల: రూ. 160/-
పేజీలు: 303
ప్రతులకు:
నవోదయ బుక్‌హౌస్
హైదరాబాద్

పరిశోధన పెందేరు లాంటిది. నిత్యం [illegible]. ఇలాంటి పరిశోధనా నేపథ్యం ఉన్న వాళ్లు తెలుగు సాహిత్య పీఠం మీద ఎక్కువగానే ఉన్నారు. [illegible] ఒక్కో కోణంలో 'తెలుగు సాహిత్యచరిత్ర'ని [illegible] చేశారు. వాటిల్లో ఒక పార్శ్వాన్ని [illegible]లోనే సాహిత్య చరిత్రకి అసంపూర్ణత కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఆ క్రమంలో జి. నాగయ్య, ద్వానా. శాస్త్రిలలో ఒకరు ప్రాచీన సాహిత్యానికి, మరొకరు ఆధునిక సాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని పాఠకులకు తెలిసినదే. **ఈ రెండింటినీ సమన్వయ ముదిగంటి సుజాతరెడ్డి.** చారిత్రక, సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్రను (1996) తొంభై ఆరు లోనే పాఠకులకందించారు తిరిగి దీన్ని "ప్రపంచీకరణం- వ్యాపారయుగం అత్యాధునిక ధోరణులు" అనే వ్యాసాన్ని చేర్చి రెండవ ముద్రణగా తీసుకొచ్చారు. విభేదించే అంశాలున్నాయని తెల్సి ఈ పుస్తకాన్ని చే.రా చేతిలో పెట్టడం ముదిగంటి సుజాతరెడ్డి నిజాయితీకి నిదర్శనంగా పాఠకులు స్వీకరిస్తారు.

ఇక ఈ పుస్తకం లోపలికి వెళ్తే తెలుగు సాహిత్య చరిత్ర ''మళ్ళీ మళ్ళీ, అదే అదే చదువుతున్నామా" అని పాఠకుడు అసహనానికి లోనయినప్పటికీ వ్యక్తుల పేర్లతో యుగ విభజన చేయడం ఒక రకంగా సాహసం. సగానికి పైగా పుస్తకం అకడమిక్‌గా ఉంది. ఈ విధానం సివిల్స్, గ్రూప్స్‌కి, ఇతర పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకి బాగా ఉపయోగపడ్తుంది. ప్రతీ కవిని గురించిన సంక్షిప్త వివరణ ఇవ్వడంవల్ల సులభతరంగా ఉంది. ఇప్పుడే తెలుగు సాహిత్యానికి పరిచయం అయిన పిల్లవాడి దగ్గరనుండి పండితులవరకు సునాయాసంగా చదివించే గుణం ఈ పుస్తకంలో ఉంది. సమగ్రంగా అందించాలనే తపనలో కొందరి వ్యక్తుల ప్రాధాన్యత దెబ్బతిన్నది. అంతకాదు గుర్రంజాషువాపై, కుసుమ ధర్మన్నలాంటి తొలితరం దళితకవిని పట్టించుకోకపోవడం వంటి విషయాలు పాఠకుల్లో అసహనాన్ని కల్గించే ప్రమాదమూ ఉంది.

ఇకపోతే రెండవ ముద్రణకు చేర్చిన చివరి వ్యాసం "అత్యాధునిక ధోరణులు" వ్యాసం చర్చకు దారితీస్తుంది. చెప్పే విషయాల్లో సూటిదనంతోపాటు కొత్తకోణం, విలక్షణం ఏదైనా ఉంటేనే పాఠకులు బాగా స్వీకరిస్తారన్న విషయం రచయిత్రికి తెలియనిది కాదు. అయినా వ్యక్తుల పేర్లతో యుగ విభజన చేసి కొత్త కోణాన్ని ఆవిష్కరించిన విధానం ముందు దీన్ని మరిచి పాఠకుడు హాయిగా చదివి ఆకళింపు చేసుకుంటాడనడంలో సందేహం లేదు. "అసంపూర్ణంలోనైనా సంపూర్ణతను, స్పష్టతను, విభిన్నతను సాధించిన రచయిత్రి నిజాయితీని ప్రతీ పాఠకుడు మెచ్చుకోవడమే కాకుండా ఇంకా మరింత ఆస్వాదనడంలో సందేహంలేదు.

-వేము

నిజ జీవితంతో ముడివేసుకున్న "మన్నుబువ్వ"

దళిత జీవితాలను,వారి వెతలను, జీవన విధానాలను, వ్యవస్థలో వారు దోపిడికి గురవుతున్న తీరును విప్పి చెప్పిన కథల సమాహారమే జాజులగౌరి "మన్నుబువ్వ". దళిత జీవితాలను రికార్డు చేయడంలో రచయిత్రి ప్రయత్నం ప్రశంసనీయం. కాల్పనిక సాహిత్యంలో, ఊహాజనితమైన పాత్రలు కాకుండా నిమ్నజాతుల జీవితాలను కథావస్తువులుగా తీసుకున్నారు. వారి జీవితాల్లోని చీకటి కోణాలను ఆవిష్కరించారు. కథలన్నీ తెలంగాణా మాండలికంలో ఉండటం ఈ పుస్తకం ప్రత్యేకత. రెండు దశాబ్దాల నాటి సమాజాన్ని మన ముందుంచే ప్రయత్నం చేశారు. దళిత జీవుల కష్టాల కడగళ్లకు కారణాలేంటి?, వాటికి కారకులెవరు అనే విషయాలను చిన్నచిన్న కథల రూపంలో చెప్పిన తీరు బాగుంది. వర్తమాన సమాజానికి ఈ కథలు ప్రతిబింబాలు. కథలనిండా పనిసంస్కృతి ఉంది. స్వీయ జీవితం ఆధారంగా రాసిన కథలే ఎక్కువగా ఉన్నాయి.

చిన్నాచితక లీడర్లు అమాయక జనాన్నిఎలా మోసం చేస్తారో "పట్టాలు" కథలో చెబుతారు. ఉప సర్పంచ్ శ్యామయ్య, యాదగిరి లాంటి వారి రూపంలో నాయకుల మోసాలు చూపిస్తారు.

అట్టడుగు వర్గాల వారి పిల్లలు ఎందుకు చదువుకు దూరం అవుతున్నారు. "అక్షరం" కథలో "అమ్మా సదువంటే ఎందే?" అని బుజ్జి తల్లిని ప్రశ్నిస్తుంది. ఇది లక్షలాది మంది పిల్లల ప్రశ్నగా మనకు అన్పిస్తుంది.

"నీళ్లబాయి" కథలో ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో బావులుండేవనే దాన్ని ఇప్పటి తరానికి అందించారు. ఇదే కథలో ఆడ, మగ పిల్లలను ఎలా వేరు చేస్తారో చక్కటి ఉదాహరణలతో మనముందు ఆవిష్కరిస్తారు. పేదరికాన్ని, పేదల ఆర్థిక స్థితిని ఆసుపత్రికి తీసుకెళ్లలేని దైన్యస్థితిని "కొటీలు" కథలో వివరించారు.

నీడలా వెంటాడే అంటరాని తనాన్ని "గుండం" కథలో ఆవిష్కరించారు.

ఈ సంపుటిలోనే కొంత ప్రత్యేకతను సంతరించుకున్న కథ "సూరీడు". నాగిరెడ్డి పటేల్ వద్ద జీతగాడు సూరీడు. వానొచ్చిందని పశువులను ఆలస్యంగా మేతకు విడుస్తాడు. నాగిరెడ్డి పసివాణ్ణి తీవ్రంగా హింసిస్తాడు. కసిగా సూరి పరుగందు కుంటాడు."ఆవురుకుల ఉప్పెన ఉంది, ఆ పరుగుల పగ ఉంది" అంటూ కథ నడిపించిన తీరు బాగుంది. పురుషాధిక్యతను "మార్పు" కథలో క్లుప్తీకరించారు. ఉద్యోగాలు చేస్తున్న చాలా మంది మహిళలు ఎదుర్కొంటున్న హింసను కళ్లకు కట్టిస్తారు.

ఒక్కపూట కురిసిన వానకు చిందర వందరైన బడుగు జీవుల బాధలను "దేవుడు" కథలో చెప్పారు.

పేదలు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటారు కానీ వారికి తిండి మాత్రం దొరకదు. కష్టాల ఊబిలో కూరుకుపోతున్న పేదల జీవితాలను "బతుకు" కథలో చూపిస్తారు.

వైవిధ్యమైన కథ "అమ్మ". ఎయిడ్స్ వచ్చిన వారి పట్ల ఎలా మసులుకోవాలి. ఈ వ్యాధి సోకిన వారి పట్ల ఇతరులు ఎలా వ్యవహరించాలనే అంశాలను చక్కగా చెప్పారు.

అంటరాని వారిపిల్లలు చదువులో తక్కువ కాదనే విషయాన్ని"నేన్‌నేన్‌ల్లెక్కనే" కథలో చిన్న సంఘటన ఆధారంగా వివరంచారు.

"కంచె", "చదువు", "మైల", "పగటిబెల్లు", "మన్నుబువ్వ" "దస్తకత్", "సేరుపట్ల" "దవఖాన" కథల్లో కూడా సామాజికాంశాలు ఉన్నాయి. వీటిలోనూ దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలను చూపెట్టారు.

చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం 25 కథల వరకు ఉన్నాయి. కథల్లో ఇంకాస్త లోతుగా చర్చ జరిపితే బాగుండేది. కథా శిల్పం ఇంకా మెరుగుపడాలి. ప్రారంభ కథలైనప్పటికీ కొన్ని. ఎంతో అనుభవం ఉన్న రచయిత్రి రాసినవిలా అన్పిస్తాయి. మంచి రచయిత్రిగా ఎదగడానికి కావాల్సిన లక్షణాలన్నీ జాజుల గౌరికి పుష్కలంగా ఉన్నాయి. సమాజంలోని మరిన్ని చీకటి జీవితాలను కథలరూపంలో తీసుకు రావాలని ఆశిస్తూ....

- గోర్ల బుచ్చయ్య



మన్ను బువ్వ
జాజుల గౌరి
వెల: రూ. 75/-
పేజీలు: **154**
ప్రతులకు: అన్ని బుక్‌స్టాల్స్‌లో

స్వీకారం

సామాజిక పరిణామాలు
బి.ఎస్. రాములు
వెల: రూ. 70/-
పేజీలు: **181**
ప్రతులకు:అన్ని బుక్ స్టాల్స్‌లో

రమణీయం
డా॥వెంకట రమణారావు
వెల: రూ. 95/-
పేజీలు: **215**
ప్రతులు: విశాలాంధ్ర, నవోదయ, బుక్ సెంటర్లలో

"వాళ్ళూ బతకాలికదా!"

అంపశయ్య నవీన్

ఎక్కడికెళ్ళొస్తున్నారు?"

"కనిపించడంలేదూ... రైతు బజార్‌కెళ్ళి కూరగాయలుతెస్తున్నా"

నేనూ అక్కడికే వెళ్ళొన్తున్నా. కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి గదండీ?"

"వేరే వస్తువుల ధరలతో పోలిస్తే కూరగాయల ధరలు నయమేలెండి"

''యేం నయమండి బాబూ! మొన్నమొన్నటి దాకా టమాటాలు కిలో రెండ్రూపాయలుండేవి. ఇప్పుడు ఆరు రూపాయలంటున్నారు".

"టమాటాలు మార్కెట్ కొచ్చే సీజన్ వెళ్ళిపోయింది కదండీ. కాబట్టి ఆ మాత్రం పెరుగుదల ఉంటుందిలెండి... కూరగాయలు పండించే వాళ్ళుకూడా బతకాలికదా...'"

''యేమిటండోయ్... మీరు కూరగాయలు కొనేవాళ్ళ పక్షమా? అమ్మేవాళ్ళ పక్షమా?"

"ఇద్దరి పక్షమూను..."

"అదెట్లా?"

''వాళ్ళూ బతకాలి. మనమూ బతకాలి"...

"వాళ్ళు ఇష్టమొచ్చినట్టుగా ధరల్ని పెంచేస్తే మనమెలా బతుకుతామండీ"

"వాళ్ళు ఇష్టమొచ్చినట్టుగా ధరల్ని పెంచడం లేదులెండి. వేరే వస్తువుల ధరలకూ, కూరగాయల్లాంటి ధరలకు కొన్ని వ్యత్యాసాలుంటాయి"

''యేమిటో ఆ వ్యత్యాసాలు?"

"ఎంతకాలమైనా నిలువ చేసుకోగల్గే వినియోగ వస్తువుల్ని తీసుకోండి. సబ్బులు, పౌడర్లు, స్నోలు లాంటివి. లేకపోతే టీ.వీలు, ఎయిర్‌కండిషన్లు, కంప్యూటర్ల లాంటివి. ఈ తరహా వస్తువులు కొద్దిరోజుల తర్వాత చెడిపోతాయన్న భయంలేదు. అందుకని వ్యాపారస్తులు వాటిని ఎంతకాలమైనా నిలువ చేసుకొని వాళ్ళు ఆశించినంత ధర పలికినప్పుడు అమ్ముకోవచ్చు. ఈ తరహా వస్తువుల ధరలు స్థిరంగా ఉంటాయి. వీటి విషయంలో కొనేవాళ్ళ కంటే అమ్మేవాళ్ళదే పైచేయిగా ఉంటుంది. అమ్మేవాడు ఎంత చెబితే అంత ఇచ్చి వాటిని మనం కొనుక్కోవాల్సిందే. కానీ కూరగాయల విషయంలో అలాకాదు. కూరగాయల్ని అమ్మేవాడు వాటిని ఎక్కువకాలం నిలువచేసుకోలేడు. రెండు మూడు రోజులు తర్వాత అవి కుళ్ళిపోతాయి. కుళ్ళిపోయిన కూరగాయల్ని ఎవరూ కొనుగోలు చెయ్యరు. అందువల్ల యేరోజుకారోజే కూరగాయల్ని అమ్ముకోవాల్సి ఉంటుంది. అందువల్ల కూరగాయలు ధరలు క్షణక్షణానికి మారుతుంటాయి. ఉదయం ఉన్న ధర మధ్యాహ్నాం ఉండదు. మధ్యాహ్నాం ఉన్న ధర సాయంత్రం ఉండదు. ఇక రాత్రికి ఎంతకో అంతకు కూరగాయల్ని అమ్ముకోకపోతే ఆ మర్నాటికవి చెడిపోతాయి. అందుకని కూరగాయల్లాంటి వస్తువుల విషయంలో అమ్మేవాడికంటే కొనేవాడిదే పై చేయిగా

ఉంటుంది. ఇక్కడ బేరమాడటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. టమాట ధర కిలో ఆర్రూపాయలని చెప్పాడనుకోండి. మనం ఐదురూపాయలకిస్తావా అని అడగొచ్చు. ఐదున్నరకివ్వడానికి అతడు ఒప్పుకోవచ్చు. కొన్నిసార్లు కూరగాయల ధరలు మరీ పడిపోతాయి. ఆయా సీజన్లలో ఆయా కూరగాయలు మార్కెట్‌కు విరివిగా వస్తుంటాయి. ఇలా సప్లై చాలా ఎక్కువ కావడంతో అందుకు తగిన డిమాండ్ ఉండదు. ఉదాహరణకి టమోటాల విషయమే తీసుకొండి. మొన్నమొన్ననే యేం జరిగిందో చూశాంకద. టమోటాల ధర కిలో ఒక రూపాయికి (అర్థరూపాయికూడా) పడిపోయింది. దాంతో అవి పండించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. కనీనం ఆ టమోటాల్ని పండించడానికయ్యే పెట్టుబడైనా రాకపోతే ఎలా చెప్పండి. లాభం మాట అలా ఉంచండి. కనీసం పెట్టుబడైనా రావాలికదా. అదీ రానప్పుడు ఆ రైతేంజేస్తాడు? రూపాయికి కిలోచొప్పున అమ్ముకున్న దానికంటే వాటిని యే మురికికాలువలోనో పారేయడం నయమనుకుంటాడు."

''అలాంటప్పుడు యేం చెయ్యాలంటారు?"

"కనీస గిట్టుబాటు ధరను ప్రభుత్వం నిర్ణయించాలి. వేరే వ్యవసాయ వస్తువుల ధరల విషయంలో ప్రభుత్వం కనీస ధరల్ని నిర్ణయిస్తున్నదికదా. వ్యవసాయ వస్తువుల విషయంలో ఈ విధానాన్ని అనుసరించకపోతే రైతులు చాలా ఇబ్బందులకు గురవుతారు. కొన్ని కూరగాయల విషయంలో కూడా కనీస ధరల్ని ప్రభుత్వం ప్రకటించాలి. అంతకంటె తక్కువ ధరలకు ఆ వస్తువుల్ని రైతులు అమ్మడంగానీ, మనలాంటి వాళ్ళం కొనడంగానీ జరక్కూడదు."

"ఈ ధరకే కొనుక్కోవాలని వినియోగదారుల్ని నిర్బంధించడంవల్ల వినియోగదారులకు నష్టంకాదా?"

"పెద్దగా నష్టమేమీ ఉండదు. వేరే ఎన్నో వస్తువులకు మనం వాళ్ళడిగినంత ధర ఇస్తున్నాము. ఉదాహరణకు కూల్‌డ్రింక్స్‌ని తీసుకొండి. ఎండాకాలం వచ్చిందంటే జనం కూల్‌డ్రింక్స్‌ని విపరీతంగా తాగుతారు. ఒక రూపాయి కూడా పెట్టుబడి లేకుండా తయారయ్యే 300 మిల్లీలీటర్ల కూల్‌డ్రింక్‌కు మనం ఓ పదిరూపాయలు కళ్ళుమూసుకొని చెల్లిస్తుంటాం. అలాంటప్పుడు రాత్రింబవళ్ళు కష్టపడి కూరగాయల్ని పండించే మన రైతులకు ఓ రూపాయో, రెండ్రూపాయలో ఎక్కువిస్తే... అదే కనీసధరే... మనకు పెద్దగా నష్టముంటుందని నేననుకోను. కూరగాయలు మార్కెట్లో అర్థరూపాయో పావలాయో తక్కువ చెయ్యమని గంటలకు గంటలు బేరమాడేవాళ్ళను చూస్తే నాకు ఆశ్యర్యం కల్గుతుంది. వేరేచోట్ల పందలకు పందలు ఖర్చు చేసే మనం కూరగాయల విషయంలో అర్థరూపాయికోసం అంతగా కోరడం అవసరమా? కూరగాయల్ని పండించే రైతులు కూడా బతకాలికదా" ☆

విలనిజమ్‌లో నేటి మేటి గంగోత్రి సాయి



శంకర్

పరిషత్ నాటకరంగాన బాగా నటించే విలన్ ఎవ్వరాని చూస్తే, 'పడమటి గాలి' నాటకంలోని కోడిపెంటంజయ్య పాత్రలోని కెవిఎస్‌టి సాయి, మాయోడు పాత్రలో మనం చూసిన రజితమూర్తిలాంటివారు గుర్తొస్తారు. నేటితరం నటులలో ఇటీవలే విజయవాడలో జరిగిన నంది నాటకోత్సవాలలో ఉత్తమ విలన్‌గా ఎన్నికయిన గంగోత్రి సాయి నేటి మేటి విలన్‌గా పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రతినాయకుడు(విలన్) ప్రేక్షకుల చేత ఎంతగా తిట్టించుకుంటే అంత బాగా నటించినట్లు. ప్రతినాయకుడి దుష్టత్వంలోంచి నాయకుడి(హీరో) ఉదాత్తత మరింత పెరుగుతుంది. అందుకే విలన్ పాత్రకు కనిపించని విశిష్టత ఉంటుంది. ఒరియా నాటకరంగంలోనైతే విలన్ తరువాతే హీరో తదితరులు. ఒరిస్సాలో సత్తాఉన్న విలన్ ఏ నాటకంలో ఉంటే ఆ నాటకం విజయవంతం అయినట్లే అన్నంతగా ప్రాముఖ్యతనిస్తారు. ఇక్కడ హీరోకి అభిమాన సంఘాలున్నట్లు అక్కడ విలన్‌కి అభిమాన సంఘాలున్నా ఆశ్చర్యపడక్కర్లేదు. అలాంటి విలన్‌పాత్రల్లోకి గంగోత్రి సాయి తగినంత నటనానుభవంలోంచి, ఒకనాడెదురైన తప్పనిసరి అవసరంలోంచి, దర్శకుడు అప్పజెప్పినంతనే ఏ పాత్రయినాసరే తూచ తప్పక నెత్తినేసుకున్న తీరులోంచి సాయి 'విలన్' అయ్యాడు. కొద్దిరోజులలో పెద్దతెరపై కూడా కామెడీ మిక్స్ అయిన విలన్ "బండసాయి"గా చూడబోతున్నాం. హాస్యనటుడు, సపోర్టింగ్ నటుడు, క్యారెక్టర్ నటుడు గంగోత్రి సాయితో సండే డెస్క్ శంకర్ ముఖాముఖి.

నంది అవార్డు స్వీకరిస్తున్న ఉత్తమవిలన్

గంగోత్రి ఒక సంస్థ కదా...మీ ఇంటిపేరుగా ఎట్లా మారింది?

నా అసలుపేరు దాసరి సాయికుమార్. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్నాను. చిన్నప్పటి నుంచి నాటకాలంటే ఎంతో ఇష్టం. పెదకాకానిలో 1990వ సంవత్సరంలో "గంగోత్రి" రంగస్థల సంస్థను నాయుడుగోపీగారు తదితరులు స్థాపించారు. వల్లూరి శివప్రసాద్ రచనా సహకారం, పాపినేని శివశంకర్‌లాంటి కవుల సహకారం "గంగోత్రి"కి ఒక స్థాయిని తెప్పించాయి. గంగోత్రి తయారుచేసిన నాటకం, నాటిక అంటే ఒక కొలమానంలాగా ఈరోజున ప్రఖ్యాతి చెందింది. అలాంటి ఓ మంచి సంస్థలో నేను 1993లోనే చేరాను. నటుడిగా ఇంత పరిణితి చెందానంటే గంగోత్రి కారణం. పెద్దతరం దర్శకులు అన్నపురెడ్డి శివరామరెడ్డిగారు నన్ను నటుడిగా పెంచితే, నాయుడుగోపీ తీర్చిదిద్దారు. నాయుడుగోపిగారు అంటే నాటకమే. నాటకానికి నాకు ఎంత అనుబంధమో

ఎ జర్నీ టు ఎనీవేర్!



వెన్నెల దారాల్ని
కత్తిరిస్తున్న చీకటి కత్తెర
ఆశల నూలు పోగుల్ని పేనుకుంటూ
అనంతంలోకి మనిషి ప్రయాణం...
అగాథాలు చుట్టుకుపోతున్న
నిరాశల కలుగుల్లోంచి
కూలి జారిపోతున్న ఇసుక శిఖరాలు
బీభత్సరస ప్రధానమై జీవితం
మురుగుకంపు కొడుతోంది
కరువులూ కప్పాలూ ఉరితాళ్ళయి
కంఠాన్ని బిగుసుకుంటున్నాయ్...
గంజిలో తడిసిన దారప్పోగుల్లా
ఎండి పిడచకట్టుకుపోయి
ఉంగలు చుట్టుకుపోతున్న పేగులు
ఇసుక పాదాల్ని రాల్చుకుంటూ
ఎండమావుల వెంట పరుగులు...
అదృష్టం తలుపు తట్టడమటుంచి
దురదృష్టాన్ని తప్పించుకునే పరుగులు
ఆకలిని మూట కట్టుకుని
దాహాన్ని గొంతులోనే సమాధి చేసుకుని
శిఖరాల్ని మోసుకుంటూ
ఎంతదూరమో ఈ పయనం!
ఎంత దూరమైనా పయనమే...
పయనం మనిషి ఆశాజీవి కదా...

\- చిత్తలూరి సత్యనారాయణ

అంతటి అనుబంధం ఆయనతో. అందులో మమేకం అయిన ప్రతీఒక్కరి ఇంటిపేరు గంగోత్రియే అయ్యింది. దాసరి సాయిగా కంటే గంగోత్రి సాయి అనగానే ఒకవిధమైన గుర్తింపు నాకు.

ప్రతినాయకుడి పాత్రపై మీ అభిప్రాయాలు, మీకృషి చెప్పండి.

నా ప్రారంభం హాస్యపాత్రలతోనండీ. గంగోత్రి కుటుంబంలో చేరాక ఏ పాత్ర ధరించేవారమయినా ఒకే స్థాయిలో ఉంటాం కదా...ప్రతీ పాత్ర రూపకల్పన, స్క్రిప్టు చేర్పులూ-మార్పులు, ప్రదర్శనా బాధ్యతలు ఇలా ప్రొడక్షన్ నుండి ప్రెజెంటేషన్ వరకూ అందరం కలసిమెలసి చేసుకుంటాం. ఆ వాతావరణంలో నాకు ఏ పాత్ర అప్పజెప్పితే అదే పరమావధిగా ధరించాను. "గుడ్డి" నాటికలో గుడ్డోడు వేషంతో మొదలైన నా నటనాజీవితం అనేక హాస్యపాత్రలు వేశాను. "సారీ బ్రదర్... ఇది నీ కథే" లో బడేమియా అనే కేవలం రెండునిముషాల పాత్రకు నంది అవార్డు వచ్చింది. 'భూమిపుత్రుడు'లో తమ్ముడు పాత్ర, 'హింసధ్వని'లో పాప తండ్రి పాత్ర, 'ఎడారికోయిల'లో బాబాయి పాత్ర ఇలా సపోర్టింగ్ క్యారెక్టర్ పాత్రలు వేశాను. నా ఫిజిక్ హీరోకు తగనిదని నాకు బాగా తెలుసు. ఏ వేషం అయినాసరే వేయాలని అప్పుడే అనుకున్నాను. ఒకసారి తప్పనిసరై విలన్ పాత్ర వేయాల్సివచ్చింది. అలా అలా నేడు "ఆంబోతు" నాటికలో వేసిన రౌడీ పద్దయ్య పాత్రకు నంది పరిషత్తులో ఉత్తమ విలన్‌గా బహుమతి పొందాను. వాస్తవానికి నేను స్వతహాగా చాలా శాంతస్వభావుణ్ణి. సున్నితమైన మనస్సున్నవాణ్ణి. ఏ చిన్న సంఘటనకైనా చలించిపోయేవాణ్ణి. అలాంటిది నా విలన్ యాక్షన్ చూసి "మీ కౄరత్వాన్ని చూసి భయపడిపోయామండి" అనేవాళ్ళున్నారు. "రౌడీకి ఆయుధం వాడి ధైర్యంకాదు...ఎదుటివాడి పిరికితనం" అన్న పద్దయ్య డైలాగ్ నన్నెంతో కదిలించివేసింది. ఇది అందరికీ అర్థమయ్యేలా చేయాలంటే నేను బాగా నటించాలి అనిపించింది. అలా ఏదో ఒక అంశంపట్ల నటుడిలో కదలిక ఉన్నప్పుడే బాగా చేయగల్గుతాం.

ప్రస్తుత పరిషత్తు నిర్వహణ, ఆ నాటకరంగం నుండి వెలువడుతున్న నాటకాలపై మీ అభిప్రాయం...

గత రెండుమూడేళ్ళ నాటి నిర్వహణతో పోల్చుకుంటే కొంత మెరుగనిపిస్తోంది. కానీ పోటీలలో నాటకాల ఎంపిక, జడ్జిమెంట్ తదితర అంశాలలో ఇంకా నిజాయితీతనం నెలకొనాల్సివుంది. స్క్రూట్నీలో కూడా పనికిరాదనిపించుకున్న టీమ్‌కు చెందిన వ్యక్తి జడ్జీగా నియమిం చడం లాంటివి పరిషత్తుని వదలాలి. గత నాటకాలకంటే మెరుగ్గా ఏవీ రావడం లేదు. వచ్చినంతలో వై యస్ క్రిష్ణేశ్వరరావు గారి 'ఇదో గది', మిశ్రోగారి 'ఎలా బ్రతకాలి', గంగోత్రి వారి 'ఆంబోతు', 'మాయ' మరికొన్ని నాటకాలు బాగా వచ్చాయి. ఏమైనప్పటికీ ఓ ఐదారు సంవత్సరాల క్రితం వచ్చినంత పోటా పోటీగా మాత్రం రాలేదు.

"ఆంబోతు" నాటికలోని దృశ్యం

మీ వ్యక్తిగత జీవితంలో నాటకరంగానికిస్తున్న స్థానం చెప్పండి.

ఆరోప్రాణం అనేకంటే నా పంచప్రాణాల్లో ప్రతీప్రాణంలోనూ నాటకం ఉందంటాను. అంతగా నాటకం నా జీవితంలో భాగం. అంతెందుకండీ...నేనో చిన్న ఇల్లు కట్టుకుంటున్నాను. దాని నిర్మాణంలోనే ఒక పోర్షన్ నాటకం రిహార్సిళ్ళ కోసం కట్టించుకుంటున్నాను. నాలో, నా ఇంటిలో భాగం అని ఇతరులకు చెప్పేదానికంటే ముందు నేను ఆచరించి చూపాలికదా!

☆

ప్రజాశక్తి

ప్రజాశక్తి కదిలింది మహాప్రభంజనంలా
కదిలింది కదిలింది మార్గం అన్వేషిస్తూ
కదిలింది కదిలింది కార్మిక కర్షకవర్గం నేడు
కదిలింది కదిలింది తాడితపీడిత జనావళి
॥ప్రజాశక్తి॥

సస్యశ్యామలగా ఖ్యాతి పొందిన భూమి
రైతు ఆత్మహత్యలకు నిలయమైపోతుంటే
నీరులేక నారు రాక ఆశలన్ని అడియాసలై
తెచ్చిన పైకంకు తగ్గ ఆదాయం రాకుంటే
అమాయకపు రైతన్నల ఆత్మహత్యకాండ
అన్నం పండించిన రైతన్నల క్షుద్బాధకు
॥ప్రజాశక్తి॥

కాలాలు మారుతున్నా వర్ణవ్యవస్థ మారకుంటే
కులమత భేదాలు నానాటికి తరగకుంటే
కట్నాలు లాంఛనాలు పెరుగుతు ఉంటే
కన్నెపిల్ల బ్రతుకు మార్గ నిరోధకం పెళ్ళైతే
బడుగు వర్గ తండ్రికేమొ కూతురు గుదిబండైతే
ఎవరో ఒకరికి ఇచ్చి బరువును తీర్చుకుంటుంటే
॥ప్రజాశక్తి॥

చదువులు చెప్పే వారికి విలువంటులేనిస్థితి
చెప్పిన పాఠాలకు సరిజీతాలు రాకుంటే
చిరుద్యోగ పంతుళ్ళ తీరని ఆ ఆరాటం
దయనీయం ఎప్పుడొచ్చు శుభారంభం
తాము చెప్పినచదువులు తమనే వెక్కిరిస్తుంటే
చావలేక బ్రతకలేక ఈడ్చు ఏడ్చు గురువులకై
॥ప్రజాశక్తి॥

కష్టానికి తగు జీతం పొందలేక
తెగించి సమ్మెలు చేసేవాళ్ళు
ఆకలికేకలు ఆపుకోని అభాగ్యులు
చావులపాలయ్యె అమాయకపు జీవులు
సమవర్గ సాధనకు, సమసమాజ నిర్మాణం
జరుగుటంటు ఎప్పుడో... తేల్చుకోను కదిలింది
॥ప్రజాశక్తి॥

- పేటేటి రత్న

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఐ.పి. పెట్టొచ్చా!?

నేను ఎస్.సి. హరిజన కులంవాడను. ఎమ్మార్వో ఆఫీసు అటెండరుగా పని చేయుచున్నాను. 2000సంవత్సరములో మా నాన్న గారికి ఆరోగ్యము బాగులేక డాక్టర్ వద్దకు తీసుకొనివెళ్లగా వారు క్యాన్సర్ వ్యాధి అని చెప్పారు. నేను లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారము చేస్తూన్న వారి దగ్గరకు వెళ్లి అప్పు అడుగగా వారు నీవు ఖాళీ ప్రాంసరీనోట్లపై సంతకములు పెడితేనే అప్పు ఇస్తాం లేకపోతే ఇవ్వం అన్నారు. నా తండ్రి రుణము తీర్చుకొను నిమిత్తం గత్యంతరములేక నేను ఖాళీ ప్రాంసరీనోటు పై సంతకము పెట్టాను. కాని వారు దానిపై తేది వేయలేదు. నేను నాలుగు సంవత్సరముల నుండి వారికి వడ్డీలకు వడ్డీలు చక్రవడ్డీలు నూటికి పదిరూపాయలు చొప్పున వడ్డీలు కట్టుచున్నాను. ఏ నెల అయిన వడ్డీలు ఎవరికి కట్టకపోతే, ఎస్.సి. వాడినని చూడకుండా నన్ను వారినోటికి వచ్చినట్లు తిట్టుచూ, కొట్టించు ప్రయత్నంలో ఉన్నారు. నేను అవసరము నిమిత్తము ఖాళీ ప్రాంసరీనోటు పై సంతకము పెట్టినందువలన ఐదువేల రూపాయలు ఇచ్చినవారు ఎభైవేలు ఇచ్చినట్లు, పదివేలు ఇచ్చినవారు లక్షరూపాయలు ఇచ్చినట్లు కోర్టులో వేస్తామని బెదిరించుచున్నారు. ఒకవేళ వారు కోర్టులో వేస్తే నేను ఇంతమందికి బాకీ అయియున్నాను. నేను ఐ.పి. పెట్టవచ్చా? ఇంతమంది ఒకేసారి కోర్టులో వేస్తే నా జీతము అందరికి పంచుతారా లేక ఏమి చేస్తారు తెలియజేయగలరు. వారు కోర్టులో వేస్తే మా కుటుంబపోషణ ఎలా? వారు నా దగ్గర చక్రవడ్డీలు తీసుకొని కులంపేరుతో తిట్టుచున్నారు. ఎక్కడ రిపోర్టు చేయాలి? నాకు ప్రాణరక్షణ కావాలని, లైసెన్సు లేకుండా వడ్డీవ్యాపారం చేసిన వారిపై జిల్లా శ్రీ ఎస్పీమేడం గారికి రిపోర్టు చేశాను.

కె. రాజు

ఎం.ఆర్.ఓ. ఆఫీసు, రాజాం.

ప్రామిసరినోటుపై తీసుకున్న ఎమౌంట్ వేయకుండా సంతకం పెట్టడమనేది చాలా పొరబాటు. మీరు ఉద్యోగస్తుడయి ఉండి అలా చేయాల్సిఉండకూడదు. బ్లాంక్ ప్రోనోట్లపై వారు తమకిష్టమైన ఎమౌంట్ వేసుకుని కోర్టులో కేసువేస్తే లైసెన్సు లేని కారణంగా కేసుని కొట్టి వేయించవచ్చు. ఉద్యోగస్తుడిగా ఉంటూ "ఇక్సాల్వెన్సీకి అర్హులుకాదు. కోర్టులో గనుక వారు దావావేస్తే మీ జీతంలో మూడింట రెండొంతులు వారికి చెల్లించవలసి ఉంటుంది. మీ కులం పేరుతో తిట్టినట్లయితే పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేయండి.

బి.సి. హోదా పొందవచ్చు

మేము ఐదుగురు అన్నదములం. మాది విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం. ఆనందపురం మండలంలోని కాపుకులస్తులను "మారు మనువులు" ఆధారంగా తూర్పుకాపులుగా "బి.సి" కులంలో చేర్చడమైనది. మేము బ్రతుకు తెరువుకోసం ఆనందపురం మండలాన్ని విడిచిపెట్టి వేరే మండలానికి వలస వెళ్లిపోయాము. ప్రస్తుతం మేమున్న మండలంలో కాపుకులస్తులను తూర్పుకాపు కులస్తులుగా బి.సి. కులములో చేర్చే విధానం వర్తించదు. మా తల్లితండ్రులు నిరక్షరాస్యులు కావటం వల్ల తెలియక మమ్మల్ని స్కూల్లో జాయిన్ చేసేటపుడు కాపుకులస్తులు ఓ.సి గా వ్రాయించారు. మా విద్యార్హత పత్రాలలో ప్రస్తుతం కాపు ఓ.సి.గా వ్రాయబడింది. కాని మా చిన్న తమ్ముడికి మాత్రం స్వస్థలమైన ఆనందపుర మండలంలో బి.సి సర్టిఫికెట్ చేయించి, స్కూల్లో బి.సిగా వ్రాయించాము. మా పూర్వపు రేషన్‌కార్డుపైన, తాతల ఆస్థియైన భూమిపాసు పుస్తకాలపై కులము బి.సి.గా వ్రాయబడి వుంది. మాకు బి.సి.గా రిజర్వేషన్ వర్తిస్తుందా? వర్తించదా? మా చిన్నతమ్ముడి సర్టిఫికెట్‌పై ఎం.ఆర్.ఓ సర్టిఫికెట్ ద్వారా బి.సిగా మార్పించాము. దీనివల్ల మా తమ్ముడికి ఎటువంటి ప్రాబ్లమ్ అయినా ఉంటుందా? మాకు సలహా ఇవ్వగలరు.

టి. అర్జున,

విశాఖపట్నం.

మీరు పూర్తి వివరాలు నింపుతూ ఆధారాలు తెలుపుతూ రెవెన్యూ అధికారులకు (ఆర్.డి.ఓ)కి దరఖాస్తు చేసుకోండి. వారికి మీ వద్ద మీ పూర్వికుల సర్టిఫికెట్లు వగైరా చూపించండి. దాంతో మీకు బి.సి. క్రిందకు చేర్చవచ్చును. మీ పూర్వీకుల ఆధారాలు బట్టి అధికారుల దృష్టికి తెచ్చి బి.సి. హోదాని పొందవచ్చును.

రిమూవ్ అయ్యాక రిజైన్ చేస్తే

ఆర్.టి.సి. లో కండక్టర్‌గా 10 సంవత్సరములు డ్యూటీ చేసాను. కాని కొన్ని కారణాలవల్ల కేసు అయ్యింది. రిమూవ్ అయ్యాను. కోర్టులో కేసు నడుస్తోంది. కాని కొన్ని కారణాలవలన నేను రిజైన్ చేయాలనుకుంటున్నాను. రిజైన్ చేస్తే నాకు రావలసిన ఎక్స్‌గ్రేషియా, పి.ఎఫ్, ఎస్.బి.టి. గ్రాట్యుటీ వస్తాయా? అట్లాగే నా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కూడా వస్తుందా? తగిన సలహ ఇవ్వగలరు.

రాములు

ఎక్స్. కండక్టర్, కె.పి. డిపార్ట్.

మీరు కోర్టులో వేసిన కేసు విత్‌డ్రా వేసుకుని పై అధికారుల్ని కలిస్తే మీకు రావలసిన అన్ని బెనిఫిట్స్ వస్తాయి.

రుచి

మసాలా దానిమ్మ

కావలసిన వస్తువులు:

బంగాళా దుంపలు	:	పావు కిలో
క్యారెట్	:	వంద గ్రాములు
పచ్చి బఠాణీ	:	వంద గ్రాములు
ఉల్లిపాయ ముక్కలు	:	ఒక కప్పు
పచ్చిమిర్చి	:	పది
గరం మసాలా	:	రెండు స్పూన్లు
అల్లం ముద్ద	:	ఒక స్పూన్
కరివేపాకు	:	నాలుగు రెమ్మలు
కొత్తిమీర	:	ఒక కట్ట
మైదా పిండి	:	అర కిలో
ఉప్పు	:	సరిపడా
నూనె	:	వేయించడానికి

తయారుచేసే విధానం: ముందుగా మైదా పిండిని శుభ్రంగా జల్లించుకొని కొద్దిగా డాల్డా వేసి పూరీ పిండిలాగా కలుపుకోవాలి. బంగాళా దుంపలు, క్యారెట్, పచ్చి బఠాణీ, ఉల్లిపాయ ముక్కలు ఉడికించుకోవాలి. పచ్చిమిర్చి ముక్కలు, గరం మసాలా, అల్లం ముద్ద, కరివేపాకు, కొత్తిమీర వీటన్నింటినీ ఉడికించిన వాటికి కలిపి మెత్తగా ముద్దగా చేయాలి. పూరీ పిండితో పూరీలు చేసి ఈ మిశ్రమాన్ని పూరీలలో కొంచెం కొంచెం పెట్టి నాలుగు పక్కలా మూటలాగా లాగి దానిమ్మకాయ ఆకారం వచ్చేలా చేయాలి. అన్నింటినీ చేసిన తరువాత కాగిన నూనెలో వేసి దోరగా కాల్చి తీసివేయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి. లోపల పెట్టే మిశ్రమానికి కొంచె మిఠాయి రంగు కలిపితే దానిమ్మ కాయలాగానే ఉంటాయి.

సేమ్యా గారెలు

తయారుచేసే విధానం: కప్పు సేమ్యాకు కప్పు నీళ్లలో మగ్గనివ్వాలి. ఇవి ఆరిన తరువాత బియ్యం పిండి, శనగ పిండి, ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా తరిగిన కొత్తిమీర, కరివేపాకు, ఉప్పు, అల్లం ముక్కలు వేసి గారెల పిండిలా కలుపుకోవాలి. నూనె కాగిన తరువాత వీటిని గారెల్లా చేసుకొని దోరగా వేయించాలి.

కావలసిన వస్తువులు:

సేమ్యా	:	ఒక కప్పు
నీళ్ళు	:	ఒక కప్పు
బియ్యం పిండి	:	ఒక కప్పు
శనగ పిండి	:	అర కప్పు
ఉల్లిపాయ	:	ఒకటి
కొత్తిమీర	:	ఒక కట్ట
కరివేపాకు	:	నాలుగు రెమ్మలు
అల్లం	:	చిన్న ముక్క
జీర	:	ఒక టేబుల్ స్పూన్
ఉప్పు	:	తగినంత
పచ్చిమిర్చి	:	ఐదు
నూనె	:	అవసరమైనంత

పంపినవారు: గణేశుని స్వరాజ్యలక్ష్మి, గుంటూరు

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి
సమాచారం
మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే
ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు
అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు
మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761
మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.
Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com